మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు దినపత్రిక
NETI EVARTHALU

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 12-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 163 Issue: 163

Published from Jagitial
www.evarthalu.com

12 డిసెంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:40 సూర్యాస్తమయం - సా. 5:39 తిథిః అష్టమి మ. 3:01 వరకు తరువాత నవమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) తె. 5:450 వరకు తరువాత హస్త యోగం ప్రీతి ఉ. 11:13 వరకు కరణం కౌలవ మ. 3:01 వరకు తైతుల తె. 3:440 వరకు వర్జ్యం ఉ. 11:41 నుండి మ. 1:25 వరకు దుర్ముహూర్తం ఉ. 8:52 నుండి ఉ. 9:36 వరకు మ. 12:31 నుండి మ. 1:15 వరకు రాహుకాలం ఉ. 10:47 నుండి మ. 12:09 వరకు యమగండం మ. 2:54 నుండి సా. 4:16 వరకు గుళికాకాలం ఉ. 8:02 నుండి ఉ. 9:25 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:04 నుండి తె. 5:52 వరకు అమృత ఘడియలు రా. 10:03 నుండి రా. 11:47 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:31 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

# ఎవడబ్బ సొమ్మనుకుంటున్నవ్?

**రేవంత్ సరదా కోసం 100 కోట్లు ఖర్చా?,, ప్రజాధనం దుర్వినియోగం.. ఆర్థిక నేరం,, సీఎం రేవంత్‌పై ఏలేటి మండిపాటు**



ఫుట్‌బాల్ సరదా కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి రూ.వంద కోట్లు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు.

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): ఇది ముమ్మాటికీ ఆర్థిక నేరమే అని మండిపడ్డారు. ప్రజాధనంతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు ఫుట్ బాల్ ఆడుకుంటారని ఫైర్ అయ్యారు. సీఎం ఫుట్ బాల్ సరదా కోసం రూ.100 కోట్లకుపైగా ఖర్చు పెట్టడం ప్రజాధనం దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడానికి ప్రభుత్వం రూ.ఎన్ని కోట్లు ఖర్చు చేస్తోందో, ఏయే శాఖల నుంచి ఖర్చు చేస్తోందో, ఎందుకు ఖర్చు చేస్తోందో సీఎం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'సీఎం రేవంత్ టీమ్‌ను సింగరేణి స్పాన్సర్ తరువాయి 2 వ పేజీలో...



# అయ్యయ్యో.. నేను గెస్టునే!

## మెస్సీ ఈవెంట్‌కు, ప్రభుత్వానికి సంబంధం లేదు

**ఓ ప్రైవేట్ సంస్థే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.. మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా గురువారం ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని తెలిపారు.

న్యూఢిల్లీ:అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో కలిసిన తరువాయి 2 వ పేజీలో...

# రక్తం గడ్డ కడ్తదేమో!

**తెలంగాణను వణికిస్తున్న చలి**

**రెండ్రోజులు తీవ్ర ఈదురు గాలులు**

**ఎల్లో హెచ్చరికలు జారీ**



హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): చలి తీవ్రతకు తెలంగాణ పల్లెలు వణుకుతున్నాయి. ఈ చలికి రక్తం కూడా గడ్డ కడుతుందేమోనన్నంత భయం వేస్తోంది. పట్నం, పల్లె అనే తేడా లేకుండా చలి పంజా విసురుతోంది. సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం పొగమంచు పరిస్థితులు ఉంటే, సాయంత్రం 5 దాటితే ఇంట్లో నుంచి బయటికి రావటానికి జంకుతున్నారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం సమాచారం తరువాయి 2 వ పేజీలో...

# పోటెత్తిన ఓటరు!

## తొలి విడతలో 84.28 శాతం పోలింగ్ నమోదు



**చిత్ర విచిత్రంగా సర్పంచుల గెలుపోటములు**

**కాంగ్రెస్ ఎమ్మెల్యే సొంతూరిలో బీజేపీ మద్దతుదారు విన్**

**సీఎం సొంత జిల్లాలో హస్తానికి నామమాత్రపు స్థానాలు**

ఒక చోట డ్రాలో గెలుపు.. మరో చోట తల్లిపై కూతురి విజయం.. ఇంకోచోట కాంగ్రెస్ ఎమ్మెల్యే సొంతూరిలో బీజేపీ అభ్యర్థి విన్.. ఇలా చిత్ర విచిత్రంగా సర్పంచుల విజయగాథలు నమోదయ్యాయి. రాష్ట్రంలో తొలి విడత సర్పంచ్ ఎన్నికలు ముగియగా.. అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందింది. బీఆర్ఎస్ పార్టీ దూకుడు కనబర్చగా, బీజేపీ మాత్రం నామమాత్ర స్థానాలతో సరిపెట్టుకుంది.

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. వీలైనంత ఎక్కువగా గ్రామ పంచాయతీలు ఏకగ్రీవాలు పొందగా.. గురువారం నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. ఏకంగా 84.28 శాతం ఓటింగ్ నమోదైంది. 45,15,141 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఫలితంగా మొదటి దఫా ఎలక్షన్స్‌లో 84.28 పోలింగ్ నమోదైంది. యాదాద్రి జిల్లాలో అత్యధికంగా తరువాయి 2 వ పేజీలో...



# కొండా సురేఖపై నాన్‌బెయిలబుల్ వారెంట్!?

**హాజరు కావాలని మాత్రమే కోర్టు చెప్పింది**

**నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది: సురేఖ**

మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు సమాచారం. ఇటీవల కొండా సురేఖ, ఫోన్ ట్యాపింగ్ కేసు, డ్రగ్స్ వ్యవహారం, నటి సమంత విడాకుల వివాదం వంటి సున్నితమైన అంశాలలో కేటీఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే లేపాయి. తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ కేటీఆర్ ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు.

నాంపల్లి/హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): కొండా సురేఖపై నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన కోర్టు బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకుని కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని హైదరాబాద్ పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలోనే తాజాగా ఆమెపై కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలిసింది. అయితే, ఈ అంశంపై మంత్రి కొండా సురేఖ కార్యాలయం స్పందించింది. కొన్ని పత్రికలు, ఛానళ్లలో మంత్రి కొండా సురేఖపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ ఇష్యూ చేసినట్టు వార్తలో నిజం లేదన్నారు. అయితే ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 5వ తేదీన ఉందని, కొండా సురేఖను కోర్టుకు తప్పనిసరిగా హాజరుకావాలని తరువాయి 2 వ పేజీలో...

# మీకంటే ఒవైసీ బెటర్

**టీబీజేపీ ఎంపీలపై ప్రధాని ఆగ్రహం**

**ఒవైసీ టీమ్ బాగుందంటూ ప్రశంస**

**విభేదాలు పక్కన పెట్టాలని హితవు**




న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీకి 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రంలో సరైన ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదు. ఇదే విషయాన్ని ప్రధాని మోదీ గురువారం కుండబద్ధలు కొట్టారు. రాష్ట్రంలో బీజేపీకి ఎంపీలు ఉన్నా.. సరైన ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో పార్టీ ఎందుకు వెనుకబడిందని ఎంపీలను ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉన్నా.. వెనకబడటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా పార్టీలో అరంతర్గ విబేధాలు వీడి.. సమష్టిగా పనిచేయాలని చెప్పారు. రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరిగేలా కృషి చేయాలని ఏంపీలకు సూచించారు. ఈ క్రమంలో అసదుద్దీన్ ఒవైసీని ఉదహరించిన ప్రధాని తరువాయి 2 వ పేజీలో...



**17న హైదరాబాద్‌కు ముర్ము**

**21 వరకూ నగరంలోనే బస**



**ఆండ్రాయిడ్ ఫోన్లలో 'ఎమర్జెన్సీ లైవ్ వీడియో'**



**ఇండిగో బాధితులకు రూ.10 వేల వోచర్లు**

**రూ.100కే టీ20 ప్రపంచకప్ టికెట్లు**

నిన్న సాయంత్రం నుంచే అమ్మకం షురూ

భారత్-యూఏఈ మ్యాచ్ టికెట్


విడుదల చేసిన సూర్య, రవిశాస్త్రి



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,075 |
| వెండి (గ్రాము): | రూ.209 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,829 |

## విశ్వవాణి



ప్రస్తుతం భూమ్మీద ఉన్న ప్రతి మనిషికి ఒక డీఎన్ఏ కామన్‌గా ఉంటుంది. అదే మైటోకాండ్రియల్ డీఎన్ఏ. 1,50,000-2,00,000 సంవత్సరాల క్రితం ఆఫ్రికాలో నివసించిన ఒక మహిళ నుంచి ఈ డీఎన్ఏ సంక్రమిస్తూ వస్తోంది. ముఖ్యంగా ప్రతి తల్లి నుంచి బిడ్డకు చేరుతోంది. అయితే, ఆ మహిళ భూమ్మీద పుట్టిన తొలి మహిళైతే కాదు. ఆమె జీవించిన సమయంలో చాలా మంది స్త్రీలు నివసించేవారు. కానీ, ఆమె డీఎన్ఏ మాత్రమే మనకు సంక్రమించింది.



# రేవంత్‌ది 3 రూపాయల మైండ్‌సెట్

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు తీవ్ర విమర్శలు

సీఎం రేవంత్ రెడ్డిది 3 రూపాయల మైండ్‌సెట్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర విమర్శలు చేశారు. 'ఓయూ అంటే కన్నతల్లి లాంటిది. ఓయూకు వెళితే రేవంత్ రెడ్డి ఏవో నాలుగు మంచి మాటలు మాట్లాడతాడని అనుకుంటే ఓయూకు వెళ్లినా తీరు మారలేదు' అని మండిపడ్డారు.

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): పొంతన లేని విషపూరితమైన ప్రసంగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై ప్రత్యక్షంగా.. పరోక్షంగా ద్వేషం వెదజల్లడానికి రేవంత్ రెడ్డి ప్రతీ వేదికను దుర్వినియోగం చేస్తున్నాడని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ -2 వ పేజీలో...

**• నాకు ఫుట్‌బాల్ ఆడటం ఇష్టం: రేవంత్**



ఫుట్‌బాల్ ఆడటం ఇష్టమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం వోక్సెన్ వర్సిటీని సందర్శించిన ఆయన అక్కడి మైదానంలో కాసేపు ప్రాక్టీస్ చేశారు. అనంతరం ట్విట్టర్ వేదికగా 'ఫుట్‌బాల్ నాకు ఇష్టమైన ఆట. టీం స్పిరిట్‌ను ప్రదర్శించాల్సిన క్రీడ. తెలంగాణ టీంకు లీడర్‌గా 4 కోట్ల మంది ప్రజలను గెలిపించాలన్న తపన నిత్యం నాలో ఉంటుంది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ కంకోల్ లోని వోక్సెన్ యూనివర్సిటీ సందర్శన సందర్భంగా అక్కడ విద్యార్థులతో ఇలా ఫుట్‌బాల్ మైదానంలో కాసేపు ప్రాక్టీస్ చేశాను' అని పేర్కొన్నారు. -సంగారెడ్డి

## రాశి ఫలాలు
12.12.2025

మేషం: వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టె విషయంలో జాగ్రత్త అవసరం. సంతాన ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. దూరప్రయాణాలు వాయిదా పడుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది.

వృషభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. మాతృ వర్గం వారితో అకారణ వివాదాలు కలుగుతాయి. ఉద్యోగులకు శ్రమ తప్పదు గృహ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ప్రయాణాలు చివరి నిమిషంలో వాయిదా పడతాయి. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి.

మిధునం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. బంధు వర్గం నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఉద్యోగమున పురోగతి సాధిస్తారు.

కర్కాటకం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ముఖ్యమైన వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వ్యాపారాలు సామాన్యం సాగుతాయి. ఆర్థిక పరంగా స్వల్ప ఇబ్బందులు తప్పవు. బంధుమిత్రుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి.

సింహం: ఉద్యోగులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపారాలలో ఆశించిన మార్పులు చోటు చేసుకుంటాయి. ఆదాయపరంగా ఇబ్బంది. ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం లభిస్తుంది. చేపట్టిన పనులు వాయిదా పడతాయి.

కన్య: ఉద్యోగులకు అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి లభించదు. నూతన ప్రయత్నాలు ఫలించవు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు.

తుల: సమాజంలో గౌరవ మర్యాదలు లోటుండదు. వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఆర్థికంగా ఇబ్బందులు అధిగమించి ముందుకు సాగుతారు. ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. సంతానానికి నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన పనులు అనుకూలంగా సాగుతాయి.

వృశ్చికం: నూతన వ్యాపారాలు ప్రారంభించటానికి అవరోధాలు తొలగుతాయి. ఆప్తుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు. ఉద్యోగులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. దూరపు బంధువులు ఆగమనం కలిగిస్తుంది.

ధనస్సు: భూవివాదాలు పరిష్కారమౌతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. మిత్రుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని మార్పులు ఉంటాయి. ప్రయాణాలు వీలైనంత వాయిదా వెయ్యడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

మకరం: వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. పాత మిత్రులను కలుసుకుంటారు. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. సన్నిహితుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

కుంభం: నూతన వాహనయోగం ఉన్నది. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.

మీనం: కుటుంబ సభ్యులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. ఇంటాబయట ప్రోత్సాహకార వాతావరణం ఉంటుంది. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. శత్రు సమస్యలు నుండి తెలివిగా బయటపడతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది.

# పోటెత్తిన ఓటరు!



మొదటి పేజీ తరువాయి

92.88 ఓటింగ్ నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యల్పంగా 71.79 శాతం ఓటింగ్ రిజిష్టరైంది. ఆశ్చర్యంగా.. తొలి విడతలో మూడు సర్పంచి స్థానాలు లాటరీ ద్వారా తేలాయి. అయితే, ఈ ఫలితాలు సీఎం రేవంత్ రెడ్డికి భారీ షాక్ ఇచ్చాయి. అతడి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీకి మోస్తరు సర్పంచ్ స్థానాలు దక్కాయి. అధికారంలో ఉండటం.. సొంత జిల్లా కావడంతో దాదాపుగా క్లీన్ స్వీప్ చేయాల్సి ఉండగా నామమాత్రంగా సర్పంచ్ పదవులు వచ్చాయి. ఇక, తల్లిపై ఓ కుమార్తె విజయం సాధించి ప్రత్యేకంగా నిలిచింది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లిలో తల్లీకుమార్తెలు గంగవ్వ, పల్లెపు సుమ పోటీ చేశారు. ఆసక్తికరంగా పోలింగ్ జరగ్గా వెలువడిన ఫలితాల్లో తల్లిపై ఆమె కుమార్తె పల్లెపు సుమ సర్పంచ్‌గా విజయం సాధించారు. నామినేషన్ నుంచి అనేక ఆసక్తికర పరిణామాలు గ్రామంలో జరిగాయి. పోలింగ్ జరగ్గా తల్లీకుమార్తెల మధ్య హోరాహోరీగా పోరు జరిగాయి. పోలింగ్‌లో తల్లిపై కూతురు 91 ఓట్ల తేడాతో గెలుపొందారు. అయితే తల్లీ కుమార్తెలు పోటీ పడడానికి ఒక పెద్ద కారణమే ఉంది. గ్రామానికి చెందిన యువకుడిని కుమార్తె ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో తల్లీ కుమార్తెల మధ్య భేదాభిప్రాయలతో వేరువేరుగా వెళ్లారు. వీరిద్దరు విడిపోయారు. ఇరు కుటుంబాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. కుటుంబపరంగా విడిపోయిన ఈ రెండు కుటుంబాలు ఇప్పుడు ఎన్నికల్లో తలపడ్డాయి. అయితే ఎన్నికల్లో తల్లిపై కుమార్తె పైచేయి సాధించారు. ఇక, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్వగ్రామం రంగారెడ్డి గూడలో బీజేపీ అభ్యర్థి కాటేపాగ రేవతి ఆనంద్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థిపై 31 ఓట్ల మెజారిటీతో ఆమె విజయం సాధించారు.

**ఓ అంచనా ప్రకారం..**

| పార్టీ (మద్దతుదారులు) | గెలిచిన అభ్యర్థులు |
|---|---|
| కాంగ్రెస్ | 2174 |
| బీఆర్ఎస్ | 1111 |
| బీజేపీ | 173 |
| ఇతరులు | 490 |

# మీకంటే ఒవైసీ బెటర్

మొదటి పేజీ తరువాయి

మోదీ.. ఆయన సోషల్ మీడియా టీమ్ యాక్టివ్‌గా పనిచేస్తోందని కితాబిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్ ఎన్డీఏ ఎంపీలతో ప్రధాని మోదీ గురువారం (డిసెంబర్ 11) అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ.. ఎంపీలు తీరు మార్చుకోవాలిని సూచించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని చెప్పారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలన బాగుందని కొనియాడారు. అందుకే ఆ రాష్ట్రానికి పెట్టుబడులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో సరిసమానంగా.. బీజేపీకి ఎంపీలు ఉన్నారు. కానీ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు విఫలం అవుతున్నారనే విమర్శలు ఈ మధ్య కాలంలో ఎక్కువ వస్తున్నాయి. పార్టీ బలోపేతం విషయంలోనూ రాష్ట్రంలోని పార్టీ పెద్దలు పెద్దగా దృష్టి పెట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేంధర్.. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని పార్టీలో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల తెలంగాణ బీజేపీ వర్క్ షాప్ జరిగింది. ఇందులో ఆ పార్టీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కీలక నేతలతో ఆయన మాట్లాడిన ఆయన.. నాయకుల మధ్య గ్యాప్ గురించి ప్రస్తావించారు. పార్టీ అధ్యక్షుడిని లైట్ తీసుకోవద్దని.. ప్రతి విషయం తనకు తెలుసునన్నారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ కూడా ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

# రేవంత్‌ది 3 రూపాయల మైండ్‌సెట్

మొదటి పేజీ తరువాయి

భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను క్రూరుడిని అనే సందేశాన్ని రేవంత్ రెడ్డి ప్రతీసారి ఇస్తున్నాడని.. నల్లమలకు రేవంత్ రెడ్డికి సంబంధమే లేదని ప్రకటించారు. ఉస్మానియాలో తెలంగాణ ఉద్యమం గురించి.. ఉద్యమంపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్ మాట్లాడటమా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిలాంటి తెలంగాణ ద్రోహుల వల్లే యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి ప్రాణాలు తీసుకున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి బుద్ధి మాత్రం వంకర బుద్దేనని మండిపడ్డారు. రేవంత్ ది ఫ్యూడల్ మనస్తత్వం.. తమ ఇంటి ముందు నుంచి ఎవరూ వెళ్లినా చెప్పులు విడిచి వెళ్లాల్సిందేనని ఇదే రేవంత్ గతంలో చెప్పారని గుర్తుచేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో కేసీఆర్ స్థాపించిన గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నారని.. రెండున్నర లక్షల మందికి నాణ్యత గల విద్య నందించే పేరుతో మిగతా 15 లక్షల మందికి విద్యను దూరం



చేస్తావా? అని నిలదీశారు. సామాజిక న్యాయంపై రేవంత్ రెడ్డిది పెద్ద డ్రామా.. 42 శాతం రిజర్వేషన్లపై బీసీల గొంతు కోసి రేవంత్ సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. కాంగ్రెస్‌లో బీసీ నాయకుల గొంతు కోశారు రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. 'స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు చూస్తే కొండంత రాగం తీసి గాడిద పాట పాడినట్టు ఉంది. స్కిల్ యూనివర్సిటీలో పట్టుమని పది కోర్సులు కూడా లేవు' అని వివరించారు. 'స్పోర్ట్స్ యూనివర్సిటీకి తెలంగాణ నుంచి నిపుణులు లేరని కేరళ నుంచి ఒకాయనను తెచ్చి రేవంత్ వీసీగా నియమించారు. గ్లోబల్ సమ్మిట్‌లో రేవంత్ ఇంగ్లీష్‌లో మాట్లాడొచ్చు. ఓయూకు వచ్చి ఇంగ్లీష్ అవసరం లేదు అంటాడు రేవంత్ రెడ్డి. తనకు రాని ఇంగ్లీష్ ఇంకెవరికి రావొద్దు అనేది రేవంత్ రెడ్డి విధానం' అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. అసలు తెలివి ఉండే రేవంత్ మాట్లాడుతున్నాడా? అని మండిపడ్డారు. ఐటీలో ఇన్ని లక్షల మంది పని చేస్తున్నారంటే వారు నేర్చుకున్న ఇంగ్లీషే కారణం అనేది రేవంత్ రెడ్డికి తెలియదా? అని నిలదీశారు. '3 ట్రిలియన్ ఎకానమీ అంటాడు. రేవంత్ రెడ్డి మూడు రూపాయల మైండ్ సెట్‌తో సాధ్యమవుతుందా? 2047 విజన్ డాక్యుమెంట్ ఓ పక్క విడుదల చేస్తూ ఇంగ్లీష్ వద్దంటున్న రేవంత్ రెడ్డిని చూసి నవ్వాలా, ఏడవాలా?' అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. 'గ్లోబల్ సమ్మిట్‌లో రేవంత్ ధరించిన బట్టలు చూసి ఎవడైనా పెట్టుబడులు పెడతారా? కేసీఆర్ మీద విషం చల్లే మాటలు మానేస్తే రేవంత్ రెడ్డికే మంచిది' అని పేర్కొన్నారు.

## ఇండిగో బాధితులకు రూ.10 వేల వోచర్లు

న్యూఢిల్లీ: ప్రయాణికులకు ఇండిగో స్వల్ప ఊరటనిచ్చింది. వరుస విమానాల రద్దు, ప్రయాణికుల ఇక్కట్లు, డీజీసీఏ చీవాట్లు నేపథ్యంలో విమాన రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులకు ఇండిగో రూ.10,000 విలువైన ట్రావెల్ వోచర్‌లను అందించనుంది. ఈ మేరకు గురువారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. డిసెంబర్ 3, 4, 5 తేదీలలో విమాన అంతరాయాల వల్ల తీవ్రంగా ప్రభావితమైన ప్రయాణికులకు రూ.10,000 విలువైన ట్రావెల్ వోచర్లను అందిస్తామని ఎయిర్‌లైన్ తెలిపింది. విమాన ఆలస్యాలు, రద్దుల కారణంగా ప్రయాణికులకు ఎయిర్‌లైన్ చెల్లించాల్సిన వాపసులు, ప్రభుత్వం నిర్దేశించిన పరిహారానికి ఇండిగో ప్రకటించిన ఈ ఆఫర్ అదనం. రాబోయే 12 నెలల్లో ఇండిగోతో భవిష్యత్తులో చేసే ఏదైనా ప్రయాణానికి వోచర్లను రిడీమ్ చేసుకోవచ్చని తెలిపింది. రద్దు చేసిన అన్ని విమానాలకు రీఫండ్ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది.

## ఆండ్రాయిడ్ ఫోన్లలో 'ఎమర్జెన్సీ లైవ్ వీడియో'

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ యూజర్ల కోసం గూగుల్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. అత్యవసర సమయాల్లో రియల్‌టైమ్ వీడియోను షేర్ చేసేలా ఎమర్జెన్సీ లైవ్ వీడియో పేరిట ఈ ఫీచర్‌ను పరిచయం చేసింది. ఆండ్రాయిడ్ ఎమర్జెన్సీ లొకేషన్ సర్వీస్ (ఈఎల్ఎస్)పై ఇది పనిచేస్తుందని గూగుల్ తెలిపింది. ఎమర్జెన్సీ సేవలకు సంబంధించిన కాల్ లేదా టెక్ట్స్ సమయంలో అవతలి వ్యక్తి అక్కడి పరిస్థితిని వివరించాలని కోరినప్పుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుందని తెలిపింది. ఆ సందర్భంలో సింగిల్ ట్యాప్‌తో లైవ్ వీడియోను స్ట్రీమ్ చేయొచ్చని, యూజర్ నచ్చినంతసేపు టెలికాస్ట్ చేయొచ్చని గూగుల్ తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో కొన్నిసార్లు పరిస్థితిని వివరించడం కష్టంగా ఉంటుందని, దీన్ని దృష్టిలోపెట్టుకొనే ఎమర్జెన్సీ లైవ్ వీడియో ఫీచర్‌ను తీసుకొచ్చినట్లు గూగుల్ ప్రెసిడెంట్ (ఆండ్రాయిడ్ ఎకోసిస్టమ్) సమీర్ సమత్ తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో జీపీఎస్, సెల్, వైఫై, ఇతర సెన్సార్ల సాయంతో కచ్చితమైన లొకేషన్‌ను ఎమర్జెన్సీ సేవల విభాగానికి ఈ సదుపాయం అందిస్తుందని వెల్లడించారు. ప్రస్తుతానికి అమెరికా, జర్మనీ, మెక్సికో దేశాల్లో ఈ సేవలు ప్రారంభిస్తున్నామని, త్వరలో ఇతర దేశాలకూ విస్తరిస్తామని పేర్కొంది.

## అయ్యయ్యో.. నేను గెస్టునే!

మొదటి పేజీ తరువాయి

ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు. కాగా, మెస్సీ గోట్ ఇండియా టూర్‌లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు రెండు జట్లుగా విడిపోయి ఆడనున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు సహా పలువురు స్టేడియంలో ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పుడేమో ఇది ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం చెప్పడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## కొండా సురేఖపై నాన్‌బెయిలబుల్ వారెంట్!?

మొదటి పేజీ తరువాయి

తనకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందన్న కథనాలపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ సీరియస్ అయ్యారు. తనకు ఎలాంటి వారెంట్ జారీ కాలేదని.. కోర్టుకు హాజరు కావాలని మాత్రమే కబురు అందిందని స్పష్టత ఇచ్చారు. ఈ క్రమంలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని మండిపడ్డారామె. 'కోర్టు నాకు ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయలేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న కోర్టుకు రావాలని చెప్పింది. నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది' అని క్లారిటీ ఇచ్చారు.

## ఎవడబ్బ సొమ్మనుకుంటున్నవ్?

మొదటి పేజీ తరువాయి

చేస్తోందని మీడియాలో చూశాను.. ఈ ఫుట్ బాల్ ఆట కోసం సింగరేణి డబ్బులను ఎంత ఖర్చు చేస్తున్నారు? ఎందుకు ఖర్చు చేస్తున్నారు? చెప్పాల్సి వస్తుంది' అని వార్నింగ్ ఇచ్చారు. ఇవే డబ్బులను సింగరేణిలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికో, కార్మికుల సంక్షేమానికో ఖర్చు చేయొచ్చని వ్యాఖ్యానించారు. మెస్సీ టీమ్‌తో రేవంత్ టీమ్ ఫుట్ బాల్ ఆడడం వల్ల రాష్ట్రానికి ప్రయోజనమేంటో చెప్పాలని నిలదీశారు. మెస్సీ ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడితే, అప్పీయరెన్స్ ఫీజు కింద రూ.70 కోట్లు తీసుకుంటారని, మరి ఆయనకు ఇచ్చే ఫీజు ఏ ప్రభుత్వ శాఖ ఇస్తోందని ప్రశ్నించారు



## రక్తం గడ్డ కడ్తదేమో!

మొదటి పేజీ తరువాయి

ప్రకారం.. రాబోయే 2-3 రోజులు సాధారణం కంటే 3 డిగ్రీల నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా ఉండే అవకాశం ఉంది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. 13న ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో చలి గాలులు వీచే సూచనలున్నాయి. 14 నుంచి పొడి వాతావరణమే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

# 17న హైదరాబాద్‌కు ముర్ము



### 21 వరకూ నగరంలోనే బస

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 17న హైదరాబాద్ రానున్నారు. 21 వరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేరామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజులపాటు రాష్ట్రంలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం సెక్రెటేరియట్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితోపాటు తగిన అగ్నిమాపక, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోడ్డు భవనాల శాఖ విభాగం అవసరమైన బారికేడింగ్‌లు, ఇతర ఏర్పాట్లు చేయాలని, జీహెచ్‌ఎంసీ, పోలీసు శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో వుంచాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని, అదేవిధంగా తేనెటీగలను పట్టుకోవానికి ముందుస్తు ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. సమీక్షలో డీజీపీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ వీసీ సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డిజిపిలు మహేష్ భగవత్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ల కోసమే కొత్త విత్తన బిల్లు

## బడా కంపెనీల ప్రయోజనాలకే పెద్దపీట.. విదేశీ విత్తనాలు దేశంలోకి వచ్చే ప్రమాదం

ఈ బిల్లును అంతా వ్యతిరేకించాలి: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న విత్తన బిల్లును వెంటనే ఆపివేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎలాంటి ట్రయల్స్ లేకుండా విదేశీ విత్తనాలు దేశంలోకి వచ్చే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతే కేంద్రంగా, రైతు ప్రయోజనాలే పునాదిగా నూతన విత్తన బిల్లు ఉండాలని అభిప్రాయపడ్డారు. విత్తనాల అంశంలో రాష్ట్రాల పాత్ర లేకుండా చేస్తున్న ఈ బిల్లును అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. రైతు సంఘాలతో పాటు విత్తన నిపుణులు, వ్యవసాయ రంగ నిపుణులు, రాజకీయ పార్టీలతో కూలంకషమైన చర్చ తర్వాతనే ఈ బిల్లుపై ముందుకు పోవాలని కేంద్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విత్తన బిల్లు డ్రాఫ్ట్‌పై బీఆర్ఎస్ పార్టీ తరఫున మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ ఈ సందర్భంగా కీలక ప్రకటన విడుదల చేశారు. కొత్త విత్తన బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విత్తన బిల్లు ముసాయిదాను భారత రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. కేంద్రం ప్రతిపాదిస్తున్న ఈ విత్తన బిల్లుతో రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని మాజీ మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఈ బిల్లును పూర్తిగా ఆపివేసి, రైతులు, రైతు సంఘాలు, నిపుణులతో, రాజకీయ పార్టీలతో చర్చించిన అనంతరం ఈ బిల్లుపై ముందుకుపోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విత్తన బిల్లులో నకిలీ విత్తనాలను కట్టడి చేసే అంశంపై స్పష్టత లేదని.. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు నిర్దిష్ట సమయంలోనే నష్టపరిహారం అందించే అంశంపై గ్యారంటీ లేదని మాజీ మంత్రి కేటీఆర్ వివరించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా విత్తనాల ధరలను నిర్ణయించేలా ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయని తెలిపారు. విత్తనాల ధరల నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకుండాపోతుందని కేటీఆర్ చెప్పారు. నకిలీ విత్తనాల తయారీలో కంపెనీలను బాధ్యులను చేయకుండా, కేవలం అమ్మకదారులను బాధ్యత వహించేలా, కేవలం సప్లై చైన్‌పై నకిలీ విత్తనాల బాధ్యతను ఉంచేలా ఈ చట్టం రూపొందించిందని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. నకిలీ విత్తనాలకు సంబంధించిన అంశంలో జాతీయ స్థాయిలో ఆయా కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేయడం, భారీ పెనాల్టీలు, కఠిన జైలు శిక్ష వంటి అంశాలకు ఇందులో పెద్దగా ఆస్కారం లేదని కేటీఆర్ ప్రస్తావించారు. రైతుల సమూహానికి ఈ బిల్లులో ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందని.. విదేశాల నుంచి నేరుగా ఆయా



కంపెనీలు ఎలాంటి విత్తన ట్రయల్స్ లేకుండానే దేశంలో తమ విత్తనాలను అమ్ముకునేలా సులభమైన నిబంధనలు ఉన్నాయని వెల్లడించారు. ఈ బిల్లు వస్తే దేశీయ విత్తన భద్రత, విత్తన సార్వభౌమత్వం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశానికి సంబంధించి రాష్ట్రాలకు, రాష్ట్రంలోని వ్యవసాయ యూనివర్సిటీలకు ఎలాంటి ప్రాధాన్యం లేకుండా చేశారని చెప్పారు. ఈ బిల్లుతో వ్యవసాయ రంగంలో కీలకమైన విత్తనాల అంశంపై కేంద్ర ఆధిపత్యానికి దారితీస్తుందని.. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రాలు సొంత చట్టాలు చేసుకుని ముందుకుపోయే అంశాన్ని బలహీనం చేస్తుందని ప్రస్తావించారు. త్వరలోనే ఈ అంశంపై మాజీ వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంపీ వినోద్ కుమార్‌తో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించి కేంద్రానికి మరిన్ని సూచనలు ఇస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.



## ఫ్యూచర్ సిటీ కాదు.. 'రియల్'

**అయోమయంలో పెట్టుబడిదారులు : మన్నె క్రిశాంక్**

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్న ఫ్యూచర్ సిటీ అంతా రియల్ ఎస్టేట్ దందా అని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ ఆరోపించారు. రెండేళ్లలో 'కమీషన్లు, కాంట్రాక్టులు, కాంగ్రెస్ పార్టీ' పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి రూ.150 కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు పెట్టి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించారని అన్నారు. 'విజన్ డాక్యుమెంట్ ఛాట్ జీపీటీలో తయారు చేశారు. మాజీ ఆర్బీఐ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తెలంగాణ గ్రోత్ స్టేట్ అని అన్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయిర్ కేసీఆర్ పాలనను మెచ్చుకున్నారు. ఫార్మాసిటీ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేసింది13వేల ఎకరాలు. సేకరణ చేస్తే కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. పెట్టుబడిదారులు కన్ఫ్యూజన్‌లో ఉన్నారు. వాంతారా జూ పార్క్‌ను కాంగ్రెస్ జాతీయ నేతలు రాహుల్ గాంధీ, జైరాం రమేష్ వ్యతిరేకిస్తున్నారు. అంబానీ, అదానీపై రాహుల్ గాంధీ మాట్లాడతారు. తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి వారితో దోస్తానా చేస్తున్నారు. తెలంగాణ రైజింగ్‌లో పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి' అని తెలిపారు.

# ఏదో సరదా కోసం అనుకున్నా.. కానీ

**నటి ప్రగతికి నాగబాబు అభినందనలు**

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): టాలీవుడ్ నటి ప్రగతి అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో సాధించిన విజయంపై జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు ప్రశంసల వర్షం కురిపించారు. ఏషియన్ ఓపెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో ప్రగతి ఏకంగా నాలుగు పతకాలు గెలుచుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. నటనతో పాటు క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో రాణించడం ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగబాబు ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. "గతంలో ఒకసారి ప్రగతి గారు చీరకట్టుకుని పవర్ లిఫ్టింగ్ చేయడం గమనించాను. అది చూసి 'ఇదేంటి చీరకట్టుకుని పవర్ లిఫ్టింగ్ చేస్తోంది, బహుశా సరదా కోసమేమో' అని అనుకున్నాను. కానీ, ఇంత నిబద్ధతతో సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తుందని నేను ఊహించలేదు" అని నాగబాబు తన ప్రకటనలో





పేర్కొన్నారు. ఆమె పట్టుదల, కృషి అభినందనీయమని తెలిపారు. వెండితెరపై తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తూనే, క్రీడారంగంలోనూ దేశానికి పేరు తీసుకురావడం నిజంగా విశేషమని నాగబాబు అన్నారు. ప్రగతి చాలామంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఆమె పట్టుదల ఎందరికో ప్రేరణ ఇస్తుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఆమె సినిమాలతో పాటు పవర్ లిఫ్టింగ్‌లో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు నాగబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు.

# 300 కోట్లతో భారీ టన్నెల్ అక్వేరియం

**కొత్వాల్‌గూడలో పీపీపీ ప్రాజెక్టు**

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): హైదరాబాద్ నగరానికి మరో భారీ ప్రాజెక్టు రాబోతోంది. నగర శివారులోని కొత్వాల్‌గూడలో రూ. 300 కోట్ల వ్యయంతో ప్రపంచస్థాయి టన్నెల్ అక్వేరియం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు, పూర్తయితే దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ అక్వేరియంగా నిలవనుంది. మల్టీవర్స్



హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పొలిన్ అక్వేరియమ్స్, కాడోల్ గ్రూప్ కన్సార్టియం కలిసి ఈ అక్వేరియంను నిర్మించనున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమి, ఇతర అనుమతులను తెలంగాణ ప్రభుత్వం సమకూర్చనుంది. టెక్నికల్ భాగస్వామిగా పొలిన్ అక్వేరియమ్స్ వ్యవహరించనుండగా, మల్టీవర్స్ హోటల్స్, కాడోల్ గ్రూప్ సంస్థలు ఆతిథ్య, మౌలిక వసతుల విభాగాలను పర్యవేక్షించనున్నాయి. సుమారు 1,75,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్ సంప్రదాయం ఉట్టిపడేలా దీనిని నిర్మించనున్నట్టు పొలిన్ అక్వేరియమ్స్ తెలిపింది. ఇందులో 100 మీటర్ల పొడవైన టన్నెల్‌తో పాటు 30 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో ట్యాంకులు ఉంటాయి. ఒకేసారి 3 వేల మంది సందర్శించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ అక్వేరియంలో 300 జాతులకు చెందిన సుమారు 10 వేల జలచరాలను ప్రదర్శనకు ఉంచుతారు. దీంతో పాటు అండర్ వాటర్ రెస్టారెంట్ వంటి ప్రత్యేక ఆకర్షణలు కూడా ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఏడాది నాటికి ఈ టన్నెల్ అక్వేరియం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

## స్థానికులకు ఈ-డిప్ వైకుంఠ దర్శనం: టీటీడీ

తిరుమల, డిసెంబర్ 11 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం ఎదురుచూస్తున్న తిరుపతి, తిరుమల స్థానిక భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుభవార్త చెప్పింది. స్థానికుల కోసం ప్రత్యేక కోటా కింద ఈ-డిప్ (ఎలక్ట్రానిక్ డిప్) విధానంలో దర్శన టోకెన్లను జారీ చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 6, 7, 8 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనం కోసం రోజుకు 5,000 చొప్పున టోకెన్లు కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ టోకెన్ల కోసం డిసెంబర్ 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి డిసెంబర్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్టర్ చేసుకున్న భక్తులకు డిసెంబర్ 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు లాటరీ పద్ధతిలో టోకెన్లను కేటాయిస్తారు. కేటాయించిన 5,000 టోకెన్లలో తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల స్థానికులకు 4,500, తిరుమలలో నివసించే స్థానిక భక్తులకు 500 టోకెన్లు రిజర్వ్ చేశారు. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ లేదా వాట్సాప్ ద్వారా 1o3 విధానంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని స్థానిక భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ కోరింది.

## అమరావతికి శాశ్వత హోదా

**పార్లమెంటులో బిల్లు: పెమ్మసాని**

అమరావతి, డిసెంబర్ 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి శాశ్వత హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో గానీ, లేదా వచ్చే సమావేశాల్లో గానీ అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ బిల్లు ప్రవేశపెడతామని ఆయన తెలిపారు. రాజధానిని 2014 నుంచి గుర్తించాలా? లేక ఇప్పటి నుంచి గుర్తించాలా? అనే దానిపై ఉన్న సాంకేతిక కారణాల వల్లే బిల్లు ఆలస్యమవుతోందని పెమ్మసాని వివరించారు. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అమరావతి బిల్లుపై వైసీపీ అధినేత జగన్ విషం కక్కుతున్నారని, ఆయనను శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు పాలన చేతకాకపోవడం వల్లే 34 వేల మంది రైతులు ఇచ్చిన భూములను సద్వినియోగం చేసుకోలేక రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు. అమరావతిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే వేలాది మంది నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్నారని పెమ్మసాని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే 16 జాతీయ సంస్థలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. త్వరలోనే హడ్కో, కాగ్, పోస్టల్ భవనం, కేంద్రీయ విద్యాలయాలు వంటివి అమరావతిలో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు.

## ఒకే ఊరిలో 3,981 సర్టిఫికెట్ల రద్దు

**ఏపీలో నకిలీ జనన ధ్రువపత్రాల దందా**

శ్రీసత్యసాయి జిల్లా, డిసెంబర్ 11 (ఈవార్తలు): ఏపీలో నకిలీ జనన ధ్రువపత్రాల కుంభకోణం వెలుగు చూసింది. శ్రీసత్యసాయి జిల్లా, అగళి మండలం, కొమరేపల్లి పంచాయతీ కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని గుర్తించిన ప్రభుత్వం... అక్కడ జారీ చేసిన 3,981 బర్త్ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం 1500 లోపే జనాభా ఉన్న కొమరేపల్లి గ్రామంలో 2025 జనవరి నుంచి అక్టోబర్ 31 వరకు పది నెలల వ్యవధిలోనే దాదాపు నాలుగు వేల జనన ధ్రువపత్రాలు జారీ కావడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. వీటిలో చాలా వరకు ఇతర రాష్ట్రాల వారికి జారీ చేసినట్లు తేలడంతో ఇది వ్యవస్థీకృత మోసమని నిర్ధారించారు. ఈ వ్యవహారంపై మీడియాలో కథనాలు రావడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. జనన, మరణాల నమోదు శాఖ చీఫ్ రిజిస్ట్రార్ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి ఫిరోజ్‌బేగం విచారణకు ఆదేశించారు. జిల్లా గణాంక అధికారి కళాధర్ నేతృత్వంలోని బృందం జరిపిన విచారణలో కొమరేపల్లి పంచాయతీ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను దుర్వినియోగం చేసి ఈ నకిలీ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు తేలింది. విచారణ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ సర్టిఫికెట్లన్నింటినీ రద్దు చేయడమే కాకుండా బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అనుమానాస్పదంగా అధిక సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ అయిన 14 జిల్లాల్లో పునఃపరిశీలన చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది.

## మాజీ మంత్రి విడదల రజని గృహనిర్బంధం

పల్నాడు, డిసెంబర్ 11 (ఈవార్తలు): ఏపీలోని పల్నాడు జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంది. జంట హత్యల కేసులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు కోర్టులో లొంగిపోనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి విడదల రజనిని చిలకలూరిపేటలోని ఆమె నివాసంలో గృహనిర్బంధం చేశారు. పిన్నెల్లి సోదరులకు సంఘీభావం తెలిపేందుకు విడదల రజని మాచర్ల వెళ్తున్నారనే సమాచారంతో పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పల్నాడు జిల్లాలో సంచలనం రేపిన జంట హత్యల కేసుకు సంబంధించి వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి ఈ రోజు మాచర్ల కోర్టులో లొంగిపోనున్నారు.

## తెల్లం వెంకట్రావు సొంతూరిలో బీఆర్ఎస్ విన్

దుమ్ముగూడెం, డిసెంబర్ 11 (ఈవార్తలు): భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు సొంత గ్రామ ప్రజలు ఝలక్ ఇచ్చారు. ఆయన సొంతూరు దుమ్ముగూడెం మండలం చిన్న బండిరేవులో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయాడు. అక్కడ బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి మడకం జోగయ్య 84 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు.

## గుండెపోటుతో మృతి చెందిన అభ్యర్థి గెలుపు

వేములవాడ, డిసెంబర్ 11 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల్లో మరణించిన వ్యక్తి గెలుపొందారు. వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్ టాన బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన చెర్ల మురళి భారీ తేడాతో సర్పంచ్‌గా విజయం సాధించారు. నామినేషన్ వేసి గెలుపుపై ధీమాతో ఉన్న మురళి డిసెంబర్ 5వ తేదీన హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. డిసెంబర్ 11 గురువారం ఎన్నికలు జరుగగా.. మురళి భౌతికంగా లేకున్నా సరే చింతల్ టాన ప్రజలు మాత్రం జై కొట్టారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన చెర్ల మురళి ప్రత్యర్థిపై 370 ఓట్లతో గెలుపొందారు. మొత్తం 1717 ఓట్లు పోలవ్వగా.. మురళికి 739 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి సురువు వెంకటికి 369 ఓట్లు, కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి కోలాపురి రాజమల్లుకు 333 ఓట్లు వచ్చాయి.



## ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్ ఎన్నికలు

ఢాకా: బంగ్లాదేశ్ లో సార్వత్రిక ఎన్నికలు జరిపేందుకు సిద్ధం అవుతోంది అక్కడి ప్రభుత్వం. ఫిబ్రవరి 12న ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఆ దేశ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. డిసెంబర్ 29 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవనుంది. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఎన్నికల ప్రచారానికి అవకాశం ఉండగా.. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా 300 పార్లమెంటరీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఆ రోజు ఉదయం 7.30 నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహిస్తామని, ఇక అదే రోజు "జులై చార్టర్"పై ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరుపుతామని కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ నజీర్ ఉద్దీన్ గురువారం వెల్లడించారు.

## సర్పంచిగా జగదీశ్ రెడ్డి తండ్రి గెలుపు



సూర్యాపేట, డిసెంబర్ 11 (ఈవార్తలు): రాష్ట్రంలో జరిగిన తొలి విడత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి విజయం సాధించారు. ఆయన సూర్యాపేట జిల్లాలోని నాగారం గ్రామ సర్పంచిగా బీఆర్ఎస్ మద్దతుదారుగా పోటీ చేశారు. 95 ఏళ్ల వయస్సులో ఆయన సర్పంచిగా గెలుపొందారు. తన శేష జీవితాన్ని గ్రామానికి అంకితం చేస్తానని, గతంలో తన కుటుంబం గ్రామానికి చేసిన సేవలను గుర్తుంచుకోవాలని ఆయన ఓటర్లను కోరారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు విజయం సాధించారు. వెంకట్రాములు గౌడ్ 15 ఓట్ల తేడాతో గెలుపొందారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలం కొండాపూర్ గ్రామంలో కాంగ్రెస్ మద్దతుదారు బేగరి పండరి ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని పరందోలి గ్రామ సర్పంచిగా స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ పుష్పలత ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చింతల్‌ఠాణా గ్రామంలో ఇటీవల మరణించిన అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. సర్పంచ్ అభ్యర్థి చెర్ల మురళి ఐదు రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. మరణించిన వ్యక్తికి అత్యధిక ఓట్లు రావడంతో ఫలితాన్ని ప్రకటించకుండా రిటర్నింగ్ అధికారి ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేచి చూస్తున్నారు.

## జగిత్యాలలో తల్లిపై కూతురు విజయం

కోరుట్ల, డిసెంబర్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తల్లి, కుమార్తె మధ్య పోటీలో కూతురు గెలుపొందింది. రిజర్వేషన్‌లో బీసీ మహిళకు కేటాయించడంతో శివరాత్రి గంగవ్వను బీఆర్ఎస్ బలపరచగా, ఆమె కుమార్తె సుమలతను కాంగ్రెస్ బలపరిచింది. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపులో తల్లి గంగవ్వపై కుమార్తె సుమలత 91 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

## ప్రభాకర్ రావుకు సుప్రీం షాక్

**వెంటనే లొంగిపోవాలని ఆదేశం**

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తెలంగాణ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారుల ఎదుట శుక్రవారం బేషరతుగా లొంగిపోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తునకు ప్రభాకర్ రావు ఏమాత్రం సహకరించడం లేదని, ఆయనకు గతంలో మంజూరు చేసిన మధ్యంతర అరెస్ట్ ఉపశమనాన్ని ఎత్తివేయాలని కోరుతూ సిట్ అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసులో కీలకమైన ఐఫోన్‌కు సంబంధించిన క్లౌడ్ ఖాతాల పాస్‌వర్డ్‌లను ఆయన రీసెట్ చేసి, సమాచారం ఇవ్వడం లేదని తమ పిటిషన్‌లో ఆరోపించారు. సిట్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, విచారణ సందర్భంగా ప్రభాకర్ రావును శారీరకంగా హింసించవద్దని దర్యాప్తు బృందానికి ప్రత్యేకంగా సూచించింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో ఈ కేసులో ప్రభాకర్ రావు చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకున్నట్లయింది.

## హైదరాబాద్‌లో ఒకేచోట నాలుగు కార్లు దగ్ధం

జూబ్లీహిల్స్/హైదరాబాద్, డిసెంబర్ 11 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ఒకే చోట నాలుగు కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహ్మత్ నగర్ డివిజన్, ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నాలుగు కార్లు పూర్తిగా దగ్ధం కాగా, మరో కారు, ఒక ట్రాలీ ఆటో పాక్షికంగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, సమీపంలోని నివాసాల వారు ఈ మైదానంలో కార్లను పార్కింగ్ చేస్తుంటారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదవశాత్తు జరిగిందా, లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో పోలీసుల విచారణ జరుపుతున్నారు. ఎస్ఆర్ నగర్ ఏసీపీ, బోరబండ ఏసీపీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## సుంకె రవిశంకర్ సొంతూరిలో బీజేపీ గెలుపు

గంగాధర, డిసెంబర్ 11 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దూలం కళ్యాణ్ విజయాన్ని సాధించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్వగ్రామం అయినప్పటికీ, ఓటర్లు భిన్న తీర్పునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో ఉన్న అభ్యర్థిని బలపరచడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వయంగా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రభావశీలమైన నేతలు ఉన్న పరిస్థితుల్లో కూడా బీజేపీ అభ్యర్థి విజయం సాధించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. దూలం కళ్యాణ్ విజయం గ్రామంలో కొత్త రాజకీయ మార్పులకు దారితీశాయి.



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. - రుద్రంగి, డిసెంబర్ 11 (ఈవార్తలు)



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనారావుపేట మండలం మల్కపేటలో బీఆర్ఎస్ వేములవాడ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. - కోనారావుపేట, డిసెంబర్ 11 (ఈవార్తలు)

## జగిత్యాలలో 89 మందికి నోటీసులు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 11 (ఈవార్తలు): తొలి విడత పోలింగ్‌లో విధులు కేటాయించినా, 89 మంది సిబ్బంది హాజరుకాకపోవడంపై జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**నారాయణపేటలో 74 మందికి..**

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులకు నారాయణపేట కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నారాయణపేట జిల్లాలో గురువారం జరిగిన ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించి గైర్హాజరు అయిన 74 మంది ఎన్నికల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జగిత్యాల జిల్లాలో 77.68 % పోలింగ్

జగిత్యాల టౌన్, డిసెంబర్ 11 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో మొదటి విడత ఎన్నికల పోలింగ్ 77.68 శాతం నమోదు అయింది. భీమారం, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, కోరుట్ల, మల్లాపూర్, మేడిపెల్లి, మెట్‌పెల్లి మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు. 7 మండలాల్లో కలిపి మొత్తం ఓట్లు 2,18,194 ఉండగా పోల్ 1,69,846 అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 77.68 శాతం పోలింగ్ నమోదు అయింది.

# మౌలిక సదుపాయాలకు పెద్ద పీట

## ఉద్యోగులు, విద్యకు ప్రాధాన్యం.. ఏపీ క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు



అమరావతి, డిసెంబర్ 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో రహదారుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, విద్యా రంగం, జైళ్ల సంస్కరణలకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా జాతీయ రహదారి 16పై భారీ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తాడేపల్లి వరకు 3.8 కిలోమీటర్ల పొడవున ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎల్1 బిడ్‌ను ఆమోదించారు. ఈ ప్రాజెక్టులో ఇంటర్‌ఛేంజ్‌లు, వంతెనలు, అండర్‌పాస్‌లు కూడా భాగంగా ఉంటాయి. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువ రూ.532 కోట్ల 57 లక్షలుగా నిర్ణయించారు. దీనితో పాటు, చిత్తూరు జిల్లా కుప్పంలోని పలార్ నదిపై ఉన్న చెక్‌డ్యామ్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల కోసం సవరించిన పరిపాలనా ఆమోదాన్ని కేబినెట్ మంజూరు చేసింది. గతంలో రూ.10.24 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.15.96 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట కల్పిస్తూ రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 3.64 శాతం చొప్పున డీఏ చెల్లించనున్నారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని 417 పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో 227 తెలుగు, 91 హిందీ భాషా పండితుల పోస్టులతో పాటు 99 వ్యాయామ ఉపాధ్యాయుల (పీడీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్ల కేడర్‌కు ఉన్నతీకరించారు. బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేస్తూ జైళ్ల సంస్కరణల దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రూపొందించిన 'మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023'కు అనుగుణంగా 'ది ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్, 2025' ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును త్వరలో శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గంజాయి వంటి నేరాలకు పాల్పడిన ఖైదీలకు సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో సంస్కరణ తీసుకురావడంపై మరింత అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతోపాటు, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు పునర్వ్యవస్థీకరణకు కూడా కేబినెట్ ఆమోదించింది. ఈ బోర్డుకు చైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులను నియమించనున్నారు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహం అందించే క్రమంలో వైజాగ్%-%చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులకు కేబినెట్ పూర్తి ఆమోదం తెలిపింది. ప్రముఖ సంస్థ విరూపాక్ష ఆర్గానిక్స్‌కు 100 ఎకరాల భూమి కేటాయించాలని నిర్ణయించింది. అమరావతిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐదు కంపెనీల ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. రిలయన్స్ కన్స్యూమర్ యూనిట్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా తీర్మానించింది. రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గవర్నర్ బంగ్లా, దర్బార్ హాల్, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి సంబంధించిన బిడ్డింగ్ ప్రక్రియకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని రాజధాని నిర్మాణంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.



# విద్యుత్తు చార్జీల భారాన్ని సర్కారే భరించాలి

**ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్**

విజయవాడ, డిసెంబర్ 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతన లేదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. "చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి దొంగ పనులు" అన్నట్లుగా ప్రభుత్వ తీరు ఉందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం చేస్తోందంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) సుమారు రూ.15,651 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రజాభిప్రాయ సేకరణకు ప్రకటన కూడా జారీ చేసిందని షర్మిల గుర్తుచేశారు. ఇంత జరుగుతున్నా, ప్రజలపై భారం పడదని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని పదేపదే చెప్పడం పాత చింతకాయ పచ్చడిలా ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15 వేల కోట్లను ప్రజల నుంచి ట్రూ-అప్ బిల్లుల రూపంలో వసూలు చేసి వారి జేబులకు చిల్లులు పెట్టారని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి 'టైమ్ ఆఫ్ ది డే' పేరుతో ఇంకో రూ.15 వేల కోట్లను దోచుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని షర్మిల ఆరోపించారు. నమ్మి ఓటేసినందుకు ఏడాదికోసారి ప్రజలకు ఇలా 'హైటెన్షన్ షాక్' ఇస్తున్నారని, ఆర్థిక లోటు పేరుతో ప్రజల నడ్డి విరవడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రికి కొన్ని డిమాండ్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. "మీకు నిజంగా ఛార్జీలు పెంచకూడదనే చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మీద నిలబడాలనుకుంటే, ఏపీఈఆర్సీ ప్రతిపాదనలపై తక్షణం స్పందించండి. ప్రతిపాదిత రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని అధికారికంగా ప్రకటించండి. అలాగే, ఇప్పటివరకు ప్రజలపై మోపిన రూ.15 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను కూడా వెంటనే రద్దు చేయాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

# 200 కోట్లతో గ్లోబల్ బయో ఫౌండ్రీ

## అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఏర్పాటుకు ప్రతిపాదన

### చంద్రబాబుతో పరిశోధకులు, విద్యావేత్తల బృందం భేటీ



అమరావతి, డిసెంబర్ 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, అత్యాధునిక సాంకేతిక పరిశోధనలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న 'క్వాంటమ్ వ్యాలీ'ని వేదికగా చేసుకొని, నూతన ఔషధాలు, మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలు చేసేందుకు 'గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ' ముందుకొచ్చింది. రూ. 200 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పలు దేశాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో కూడిన బృందం సమావేశమై తమ ప్రతిపాదనలను వివరించింది. ఈ సందర్భంగా గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ప్రతినిధులు మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఈ కేంద్రం దేశంలోనే తొలి క్వాంటమ్ బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా నిలుస్తుందని తెలిపారు. మాలిక్యులర్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ సిమ్యులేషన్స్, మెటీరియల్ సైన్స్ వంటి క్లిష్టమైన రంగాల్లో తమ పరిశోధనలు సాగుతాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ ప్రభుత్వ విధానాలు, క్వాంటం వ్యాలీ ఏర్పాటు వంటి అంశాలు తమను ఎంతగానో ఆకర్షించాయని వారు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యారోగ్యం, ఔషధాల తయారీ వంటి రంగాల్లో విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. క్వాంటమ్ పరిశోధనల ద్వారా బయోసెన్సార్ల వంటి అప్లికేషన్లను అభివృద్ధి చేసి, వాటి ఫలాలను ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గతంలో ఐటీ, జీనోమ్ వ్యాలీ వంటివి ఎలా విజయవంతమయ్యాయో, ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ కూడా అదే స్థాయిలో నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే అమరావతిలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రం (ఏక్యూసీసీ) కార్యకలాపాలు ప్రారంభిస్తుందని చంద్రబాబు తెలిపారు. జాతీయ క్వాంటమ్ మిషన్‌ను అందిపుచ్చుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళుతోందని వివరించారు. క్వాంటమ్ బయో ఫౌండ్రీ ఏర్పాటు ఒక వినూత్న ఆలోచన అని అభినందించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, రవాణా వంటి కీలక రంగాల భాగస్వాములందరూ క్వాంటమ్ వ్యాలీ సేవలను వినియోగించుకునేలా ఒక సమగ్ర ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలకు ఇది కీలక కేంద్రంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.



# పిన్నెల్లి సోదరులకు 14 రోజుల రిమాండ్

మాచర్ల, డిసెంబర్ 11 (ఈవార్తలు): జంట హత్యల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి మాచర్ల కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారిద్దరూ గురువారం మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట లొంగిపోయారు. విచారణ అనంతరం న్యాయమూర్తి వారికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించనున్నారు. ఈ ఏడాది మే 24న మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో టీడీపీ నేతలు జవ్విశెట్టి వెంకటేశ్వరరావు, జవ్విశెట్టి కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో పోలీసులు పిన్నెల్లి సోదరులను ఏ6, ఏ7 నిందితులుగా చేర్చారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి సోదరులు తొలుత హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించగా పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా వారికి చుక్కెదురైంది. వారి పిటిషన్‌ను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం, రెండు వారాల్లోగా సంబంధిత కోర్టులో లొంగిపోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువు ముగుస్తుండటంతో వారు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోయారు.

# ప్రజలకు తోడుంటాం

**ప్రజా సేవకు అవకాశం ఇవ్వండి .. ముత్యంపేట వార్డు అభ్యర్థి బాలె లావణ్య-శ్రీనివాస్**



మల్యాల, డిసెంబర్ 11 (ఈవార్తలు): ప్రజలకు తోడుగా ఉంటామని, ప్రజా సేవ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ మద్దతుదారు బాలె లావణ్య-శ్రీనివాస్ కోరారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలో 11 వార్డులో బరిలో నిలిచిన ఆమె.. తమను గెలిపిస్తే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆశీస్సులతో 11వ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం పనులు వెంటనే చేపడతామన్నారు. అవసరమైన చోట ముఖ్య కూడలిలో లైట్లు ఏర్పాటు చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, పెన్షన్లు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## రామన్నపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**సర్పంచ్ అభ్యర్థి తుమ్మనపల్లి సత్యం**



మల్యాల, డిసెంబర్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ మద్దతుదారు, సర్పంచ్ అభ్యర్థి తుమ్మలపల్లి సత్యం అన్నారు. గ్రామంలోని సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, అన్ని వర్గాల ప్రజల మద్దతుతో సర్పంచ్ ఎన్నికల బరిలో ఉన్నానని తెలిపారు. గెలిపిస్తే స్థానికంగానే ఉండే తాను.. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ఎమ్మెల్యే సత్యం ఆశీర్వాదంతో గ్రామానికి అవసరమైన నిధులను తెప్పిస్తానన్నారు. గ్రామ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న సత్యానికి అన్ని వర్గాల ప్రజల నుండి ఆశీర్వాదం లభిస్తున్నట్లు సమాచారం. ప్రచారంలో మహిళలు, యువకులు బ్రహ్మాండమైన మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది.

## ముత్యంపేటను అభివృద్ధి దిశగా తీసుకెళ్తా

**సర్పంచ్ అభ్యర్థి కొండ బత్తిని త్రినాథ్**



మల్యాల, డిసెంబర్ 11 (ఈవార్తలు): మల్యాల మండలంలోని ముత్యంపేటతో పాటు, కొండగట్టు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారాల కోసం కృషి చేస్తానని ముత్యంపేట సర్పంచ్ అభ్యర్థి, తాజా మాజీ ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్ అన్నారు. గురువారం ఆయన 'ఈవార్తలు'తో మాట్లాడుతూ.. గ్రామ సమస్యల పట్ల అవగాహన ఉందని, ప్రజల సహకారంతోనే ఈసారి సర్పంచ్‌గా పోటీలో ఉన్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. తనను గెలిపిస్తే ముత్యంపేట, కొండగట్టు అభివృద్ధితో పాటు.. మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నిర్మాణం, మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం, వాటర్ ప్లాంట్‌తో నీటి సరఫరా, బ్లాక్ మెయిన్ రోడ్డు నుండి ఆది పెరుమాండ్ల గుడి వరకు సీసీ రోడ్డు, ఎల్లమ్మ గుడి అభివృద్ధి, కొండగట్టు దేవస్థానం నుండి పంచాయతీకి అందాల్సిన నిధులు, గుట్ట కింద హైవే రెండువైపులా డ్రైనేజీల నిర్మాణం, దేవస్థానంలో ముత్యంపేట ప్రజలకు నేరుగా దర్శన సౌకర్యం, ఆలయంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, గుట్ట కింద కమాన్ నిర్మాణం, ఆరు నెలలకోసారి కోతుల బెడద నివారణకు చర్యలు, యువతకు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుతోపాటు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించి ప్రజాసేవకు అంకితం అవుతానని హామీ ఇచ్చారు.

## కడప మేయర్‌గా పాక సురేశ్ ఏకగ్రీవ ఎన్నిక

కడప, డిసెంబర్ 11 (ఈవార్తలు): కడప నగరపాలక సంస్థ నూతన మేయర్‌గా 47వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ పాక సురేష్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్పొరేషన్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పర్యవేక్షణలో ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. గత మేయర్ సురేశ్ బాబుపై అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో కూటమి ప్రభుత్వం ఆయనను పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కొత్త మేయర్ ఎన్నిక అనివార్యమైంది. అయితే, మేయర్ పదవి కోసం వైసీపీలోనే ముగ్గురు కార్పొరేటర్లు పోటీ పడ్డారు. దీంతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ అవినాశ్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి జోక్యం చేసుకుని పాక సురేశ్ పేరును ఖరారు చేశారు. డిప్యూటీ మేయర్లు నిత్యానంద రెడ్డి, షఫీలు సురేశ్ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. కేవలం మూడు నెలల పదవీకాలమే మిగిలి ఉండటంతో టీడీపీ ఈ ఎన్నికకు దూరంగా ఉంది. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేటర్లందరి ఏకాభిప్రాయంతోనే అభ్యర్థిని ఎంపిక చేశామని, పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. ముద్దనూరు ఎంపీపీగా వైసీపీకి చెందిన వెన్నపూస పుష్పలత కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు సైతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు దూరంగా ఉన్నాయి.

## టీడీపీకే కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ పీఠం

కళ్యాణదుర్గం, డిసెంబర్ 11 (ఈవార్తలు): కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. ఈరోజు జరిగిన ఎన్నికలో 15వ వార్డు కౌన్సిలర్ తలారి గౌతమి నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. తీవ్ర ఉత్కంఠ నడుమ జరిగిన ఈ ఎన్నికలో బలాబలాలు సమం కావడంతో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. మొత్తం 24 వార్డులున్న కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో టీడీపీ, వైసీపీలకు చెరో 12 మంది కౌన్సిలర్ల బలం ఉంది. దీంతో చైర్మన్ ఎన్నిక హోరాహోరీగా మారింది. ఈ క్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తమ ఎక్స్ అఫీషియో ఓటు హక్కును వినియోగించుకోవడంతో టీడీపీ అభ్యర్థి గౌతమి విజయం సాధించారు. గత చైర్మన్ తలారి రాజ్‌కుమార్‌ను ప్రభుత్వం తొలగించడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. టీడీపీ విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. టపాసులు కాలుస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశాయి. నూతనంగా ఎన్నికైన గౌతమికి టీడీపీ అధిష్ఠానం శుభాకాంక్షలు తెలియజేసింది.

# మోదీ గొప్ప నాయకుడు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంస.. ప్రధాని మోదీకి ఫోన్ కాల్

### ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చ.. వాణిజ్యం, రక్షణలో సహకారంపై సమీక్ష



న్యూఢిల్లీ: భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయనడానికి సూచికగా, ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం టెలిఫోన్ సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాల పురోగతితో పాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించుకున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కొనసాగించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "అధ్యక్షుడు ట్రంప్‌తో చాలా ఆత్మీయంగా, ఫలవంతంగా సంభాషణ జరిగింది. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించాం. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించాం. ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేయడం కొనసాగిస్తాయి" అని పేర్కొన్నారు. 'భారత్-అమెరికా సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం'లో పురోగతిని నేతలిద్దరూ సమీక్షించారు. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారం నిలకడగా బలపడుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'ఇండియా%-%యూఎస్ కాంపాక్ట్' అమలులో భాగంగా కీలకమైన సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత వంటి ప్రాధాన్యతా రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉమ్మడి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు. ఇదిలా ఉండగా, గత నెలలో ట్రంప్ ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీని "గొప్ప వ్యక్తి", "నా స్నేహితుడు" అని అభివర్ణిస్తూ, త్వరలోనే భారత్‌లో పర్యటించాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. నవంబర్ 6న వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "మోదీ నా స్నేహితుడు, మేం మాట్లాడుకుంటాం. నన్ను అక్కడికి రమ్మని కోరుతున్నారు. నేను వెళతాను" అని అన్నారు. 2020లో తన భారత పర్యటన అద్భుతంగా జరిగిందని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. భారత్‌తో వాణిజ్య చర్చలు చాలా సానుకూలంగా సాగుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ కూడా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ పట్ల ట్రంప్‌కు గొప్ప గౌరవం ఉందని, ఇరువురు నేతలు తరచుగా మాట్లాడుకుంటారని ఆమె తెలిపారు. వాణిజ్య అంశంపై భారత ప్రతినిధులతో తమ బృందం ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోందని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా జరిగిన ఫోన్ సంభాషణ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

# ట్రంప్ 'గోల్డ్ కార్డ్' ప్రారంభం

**సంపన్నులకు అమెరికా పౌరసత్వం సులభం**

**వ్యక్తులకు 1 మిలియన్, కంపెనీలకు 2 మిలియన్ డాలర్ల ఫీజు**




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రతిష్ఠాత్మక 'గోల్డ్ కార్డ్' పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ పథకం కింద 1 మిలియన్ డాలర్లు చెల్లించే వ్యక్తులకు, లేదా ఒక్కో విదేశీ ఉద్యోగికి 2 మిలియన్ డాలర్లు చెల్లించే కార్పొరేట్ సంస్థలకు అమెరికాలో చట్టబద్ధమైన నివాసం కల్పించి, పౌరసత్వానికి మార్గం సుగమం చేయనున్నారు. ఈ మేరకు దరఖాస్తుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. వైట్‌హౌస్‌లో బుధవారం వ్యాపార ప్రముఖుల సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించారు. 1990 నుంచి అమల్లో ఉన్న ఈబీ-5 వీసా స్థానంలో ఈ కొత్త పథకాన్ని తీసుకొచ్చారు. దీని ద్వారా వచ్చే నిధులన్నీ నేరుగా ప్రభుత్వ ఖజానాకు వెళ్తాయని, దేశ ప్రగతికి ఉపయోగిస్తామని ట్రంప్ తెలిపారు. "ఇది గ్రీన్ కార్డ్ లాంటిదే కానీ, దానికంటే చాలా ఉత్తమమైనది, శక్తిమంతమైనది" అని ఆయన తెలిపారు. ఒకవైపు కఠినమైన వలస విధానాలు అమలు చేస్తూ, భారీస్థాయిలో బహిష్కరణలు చేపడుతున్న ట్రంప్, మరోవైపు సంపన్న వలసదారుల కోసం ఈ పథకాన్ని తీసుకురావడం గమనార్హం. అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీల్లో చదివిన ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులను ఇక్కడే అట్టిపెట్టుకోవడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని ట్రంప్ అన్నారు. ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకునే వారి నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు 15,000 డాలర్ల ఫీజు వసూలు చేస్తామని వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లట్నిక్ తెలిపారు. భారత్, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల నుంచి వచ్చే అత్యుత్తమ గ్రాడ్యుయేట్లు ఈ గోల్డ్ కార్డ్ పొందవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, యూకే, స్పెయిన్, కెనడా వంటి అనేక దేశాల్లో ఇటువంటి 'గోల్డెన్ వీసా' పథకాలు ఇప్పటికే అమల్లో ఉన్నాయి.

# వ్యాపారికి మహిళా డీఎస్పీ లవ్ ట్రాప్

**నాలుగేళ్లలో రూ.2 కోట్లకు పైగా వసూలు**

దంతెవాడ: ఛత్తీస్ గఢ్ లోని దంతెవాడ డిప్యూటీ సూపరింటెండెంట్ కల్పనా వర్మపై రాయ్ పూర్ కు చెందిన హోటల్ యజమాని దీపక్ టాండన్ సంచలన ఆరోపణలు చేశారు. కల్పన తనను ప్రేమిస్తున్నానని చెప్పి నాలుగేళ్లుగా సన్నిహితంగా ఉందని చెప్పారు. ఆమె డిమాండ్లు తీర్చేందుకు తాను రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేశానని, ఇకపై తాను డబ్బు ఇవ్వలేనని చెప్పడంతో ప్రస్తుతం తనను బ్లాక్ మెయిల్ చేస్తోందని ఆరోపించారు. డీఎస్పీ కల్పన తనతో జరిపిన వాట్సాప్ చాట్, వివిధ ప్రాంతాల్లో తామిద్దరమూ ఉన్న సీసీటీవీ ఫుటేజీలను సాక్ష్యంగా చూపిస్తూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే, ఈ ఆరోపణలను డీఎస్పీ కల్పనా వర్మ కొట్టిపారేశారు. తనను అప్రతిష్ఠపాలు చేయడానికి జరుగుతున్న కుట్ర అని ఆమె ఆరోపించారు. దీపక్ టాండన్ ఫిర్యాదుపై ప్రస్తుతం పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. ఛత్తీస్ గఢ్ లో సంచలనం సృష్టించిన ఈ కేసు వివరాల్లోకి వెళితే.. రాయ్ పూర్ కు చెందిన హోటల్ యజమాని దీపక్ టాండన్ కు 2021 లో దంతెవాడ డీఎస్పీ కల్పనా వర్మతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం పెరిగి ఇద్దరూ రిలేషన్ లో ఉన్నారు. నాలుగేళ్ల పాటు కలిసి ఉన్నట్లు దీపక్ చెప్పారు. ఈ క్రమంలో కల్పన డిమాండ్ మేరకు ఖరీదైన బహుమతులు, డబ్బు ఇచ్చినట్లు చెప్పారు. డైమండ్ రింగ్, గోల్డ్ నెక్లెస్, బ్రాస్ లెట్, ఇన్నోవా కారు ఇచ్చినట్లు చెప్పారు. రాయ్‌పూర్‌లోని వీఐపీ రోడ్‌లో తన పేరు మీద ఉన్న హోటల్‌ను ఆమె సోదరుడి పేరు మీదకు మార్పించిందని తెలిపారు. ఆ తర్వాత దాన్ని ఆమె పేరు మీదకు మార్చుకుందని ఇందుకోసం రూ.30 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నాడు. తనకు పెళ్లైందనే విషయం కూడా కల్పనకు తెలుసని, ఆమె పేరు బయటకు రాకుండా తనను విడాకులు తీసుకొమ్మని చెప్పిందన్నారు. అయితే, ఇటీవల తాను ఇకపై డబ్బు ఇవ్వలేనని చెప్పడంతో డీఎస్పీ కల్పన తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరింపులకు గురిచేస్తోందని, తనను బ్లాక్ మెయిల్ చేస్తోందని దీపక్ టాండన్ ఆరోపించారు.



# మూడ్రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. మూడు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు అడ్డుకట్ట పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో అన్ని రంగాల్లో కొనుగోళ్ల జోరు కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 426.86 పాయింట్లు లాభపడి 84,818.13 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 140.55 పాయింట్లు పెరిగి 25,898.55 వద్ద ముగిసింది. అమెరికాలో అధిక ద్రవ్యోల్బణం నేపథ్యంలో ఫెడ్ ఊహించినట్టుగానే రేట్ల కోతకు మొగ్గు చూపడం మార్కెట్లకు కలిసొచ్చింది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ తగ్గడంతో విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ఆందోళనలు తగ్గాయని విశ్లేషకులు తెలిపారు. సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ ఇండియా, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా 2.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్ షేర్లు నష్టాలతో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్, ఆటో సూచీలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల్లోనూ కొనుగోళ్లు కనిపించాయి. అయితే నిఫ్టీ మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు స్వల్ప నష్టాలను చవిచూశాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి.

# పాక్‌తో అమెరికా 686 మిలియన్ డాలర్ల ఒప్పందం

**16 జెట్ల ఆధునికీకరణకు ఆమోదం**

వాషింగ్టన్: పాకిస్థాన్‌కు భారీ సైనిక సాయం అందించేందుకు అమెరికా ముందుకొచ్చింది. పాక్ వైమానిక దళానికి చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాల ఆధునికీకరణ కోసం సుమారు 686 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 5,700 కోట్లు) విలువైన ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా అత్యాధునిక టెక్నాలజీ, విడిభాగాలు, శిక్షణ వంటివి అందించనుంది. అమెరికా రక్షణ భద్రతా సహకార సంస్థ యూఎస్ కాంగ్రెస్‌కు పంపిన లేఖను ఉటంకిస్తూ 'డాన్' పత్రిక ఈ వివరాలను వెల్లడించింది. ఈ ప్యాకేజీలో లింక్-16 వ్యవస్థలు, క్రిప్టోగ్రాఫిక్ పరికరాలు, ఏవియానిక్స్ అప్‌డేట్స్, సమగ్ర లాజిస్టికల్ సపోర్ట్ వంటివి ఉన్నాయి. ఈ ప్రతిపాదనపై యూఎస్ కాంగ్రెస్‌లో 30 రోజుల పాటు సమీక్ష జరగనుంది. ఈ కీలక పరిణామాలను భారత్ చాలా నిశితంగా గమనిస్తోంది. ఎఫ్-16 విమానాలను తయారు చేసే టెక్సాస్‌కు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ ఈ ప్రాజెక్టుకు ప్రధాన కాంట్రాక్టర్‌గా వ్యవహరించనుంది. పాకిస్థాన్ ఎఫ్-16 విమానాల నిర్వహణ, కార్యాచరణ భద్రతను మెరుగుపరచడానికే ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. ఈ ఒప్పందం వల్ల ఈ ప్రాంతంలో సైనిక సమతుల్యత దెబ్బతినదని, తమ రక్షణ సన్నద్ధతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని తన లేఖలో పేర్కొంది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో అమెరికా, మిత్రపక్షాలతో కలిసి పనిచేసేందుకు పాకిస్థాన్‌కు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని తెలిపింది. ఈ ఆధునికీకరణతో ఎఫ్-16 విమానాల జీవితకాలం 2040 వరకు పెరుగుతుందని వివరించింది. 2021లోనే పాకిస్థాన్ ఈ అప్‌గ్రేడ్‌ల కోసం అభ్యర్థించినప్పటికీ, అప్పటి పరిస్థితుల నేపథ్యంలో అమెరికా స్పందించలేదు. ఇప్పుడు ఈ ఒప్పందానికి ఆమోదం తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది.




# 15న అమెరికా ఉపగ్రహ ప్రయోగం: ఇస్రో

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగాల్లో మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. అమెరికాకు చెందిన 6.5 టన్నుల బరువున్న 'బ్లూబర్డ్-6' కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని డిసెంబర్ 15న నింగిలోకి పంపనుంది. ఇస్రోకు చెందిన అత్యంత శక్తిమంతమైన లాంచ్ వెహికల్ మార్క్-3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్న అత్యంత బరువైన ఉపగ్రహాలలో ఇది ఒకటి. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం కోసం అక్టోబర్ 19నే ఈ ఉపగ్రహం అమెరికా నుంచి భారత్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. ఇది కక్ష్యలో అతిపెద్ద కమర్షియల్ ఫేజ్డ్ అర్రేను కలిగి ఉంటుందని, గతంలో పంపిన బ్లూబర్డ్ ఉపగ్రహాల కన్నా 10 రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేస్తుందని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది. అంతరిక్ష రంగంలో భారత్, అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద సహకారం. గత జూలైలో ఇస్రో, నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన 1.5 బిలియన్ డాలర్ల నిసార్ ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఎల్‌వీఎమ్3 రాకెట్ 8,000 కిలోల బరువును లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి, 4,000 కిలోల బరువును జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి మోసుకెళ్లగలదు. ఇటీవలే నవంబర్ 2న 4.4 టన్నుల బరువున్న సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారానే విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

# 17 మంది దుర్మరణం

**అరుణాచల్‌లో రోడ్డు ప్రమాదం**

అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇండో-చైనా సరిహద్దుకు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 21 మంది కార్మికులతో వెళుతున్న ఓ ట్రక్కు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 17 మంది కార్మికులు మరణించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. అంజావ్ జిల్లాలోని హయులియాంగ్-చగ్లాగం రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే... ఈ ప్రమాదం వాస్తవానికి సోమవారం జరగ్గా, మూడు రోజుల తర్వాత ఈరోజు వెలుగులోకి వచ్చింది. ట్రక్కుతో పాటు లోయలో పడిపోయిన వారిలో ప్రాణాలతో బయటపడిన ఓ కార్మికుడు, తీవ్ర గాయాలతో సమీపంలోని పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ అధికారులకు సమాచారం అందించడంతో ఈ విషాద ఘటన గురించి బాహ్య ప్రపంచానికి తెలిసింది. ఈ విషయాన్ని అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కోజిన్ ధృవీకరించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి 10,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉందని ఆయన తెలిపారు.

# 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఫెడ్ రిజర్వ్

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు గురువారం స్వల్పంగా పెరిగాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ విలువైన లోహాల ధరలు పెరిగాయి. భవిష్యత్తులో వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ఔన్స్ 4,216 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతుండగా, వెండి ఔన్సు ధర 62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,000 పైన ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.1,19,350 పలుకుతోంది. వెండి కిలో ధర రూ.1,95,400 మార్కును చేరుకుంది. గురువారం మార్కెట్ ప్రారంభంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ఫెడ్ వడ్డీ రేటు తగ్గింపు తర్వాత ధరలు కాస్త పెరిగాయి.

# డీఎంకేలోకి విజయ్ సన్నిహితుడు



చెన్నై: తమిళ సూపర్‌స్టార్ విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఏర్పాటైన కొద్ది కాలానికే అంతర్గత సమస్యలు బయటపడుతున్నాయి. తాజాగా విజయ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న సెల్వకుమార్ పార్టీని వీడి, అధికార డీఎంకేలో చేరడం తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో సెల్వకుమార్ డీఎంకే కండువా కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీవీకేలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. టీవీకేలో సెల్వకుమార్‌కు అధికారికంగా ఎలాంటి పదవి లేనప్పటికీ, ఆయన విజయ్‌కు వ్యక్తిగతంగా చాలా సన్నిహితుడు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీని వీడటం ప్రాధాన్యత సంతరించుకుంది. సెల్వకుమార్ చేరికను డీఎంకే నేతలు స్వాగతించారు. రానున్న రోజుల్లో టీవీకే నుంచి మరిన్ని చేరికలు ఉంటాయని వారు సూచనప్రాయంగా తెలిపారు. ఈ కీలక పరిణామంపై టీవీకే అధిష్ఠానం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో సొంత పార్టీలోని సన్నిహితుడే ప్రత్యర్థి శిబిరంలో చేరడం విజయ్ కి గట్టి దెబ్బేనని చెప్పాలి.

# తత్కాల్ పారదర్శకతకే ఆధార్ ఓటీపీ

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**

న్యూఢిల్లీ: సామాన్యులకు సాధారణ, తత్కాల్ టిక్కెట్లు అందుబాటులో ఉండేలా రిజర్వేషన్ వ్యవస్థను తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తత్కాల్ వ్యవస్థలో పారదర్శకతను తీసుకువచ్చేందుకు ఆధార్ ఆధారిత ఓటీపీ వ్యవస్థను దశలవారీగా అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు లోక్‌సభలో ఆయన ఒక ప్రశ్నకు గురువారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. తత్కాల్ టిక్కెట్ల జారీ విషయంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టడంతో పాటు ఐఆర్‌సీటీసీ ఖాతాల ఏరివేతను కూడా చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 3.02 కోట్ల అనుమానాస్పద యూజర్ ఐడీలను డీయాక్టివేట్ చేసినట్లు వెల్లడించారు. ఆకామయ్ వంటి యాంటీ బాట్ టెక్నాలజీని వినియోగించి నకిలీ, ఆటోమేటెడ్ ప్రయత్నాలను అడ్డుకున్నామని అన్నారు. ప్రస్తుతం 322 రైళ్లకు ఆధార్ ఆధారిత ఓటీపీ వ్యవస్థను వర్తింపజేశామని ఆయన అన్నారు. దీని ద్వారా ఆయా రైళ్లలో తత్కాల్ టిక్కెట్ల అందుబాటు సమయం దాదాపు 65 శాతం మేర పెరిగిందని తెలిపారు. అలాగే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తత్కాల్ బుకింగ్స్‌కు ఓటీపీ వెరిఫికేషన్ విధానాన్ని డిసెంబర్ 4 వరకు 211 రైళ్లకు వర్తింపజేసినట్లు తెలిపారు. దీనివల్ల 96 పాపులర్ రైళ్ల టిక్కెట్ల అందుబాటు సమయం 95 శాతం మేర పెరిగిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

# 100 కంపెనీలు.. 148 లక్షల కోట్లు

**భారత స్టాక్ మార్కెట్ సరికొత్త రికార్డు**

**30 ఏళ్లలో ఎన్నడూ లేనంత సంపద సృష్టి**

ముంబై: భారత ఈక్విటీ మార్కెట్ గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా సంపదను సృష్టించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. 2020-2025 మధ్య ఐదేళ్ల కాలంలో దేశంలోని టాప్ 100 కంపెనీలు ఏకంగా రూ.148 లక్షల కోట్ల సంపదను సృష్టించాయి. కరోనా మహమ్మారి తర్వాత మార్కెట్లు వేగంగా పుంజుకోవడమే ఇందుకు ప్రధాన కారణమని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తన నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, సంపద సృష్టిలో ఫైనాన్షియల్స్ రంగం అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాత ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ మార్కెట్స్, టెక్నాలజీ, యుటిలిటీస్ రంగాలు ఉన్నాయి. ముఖ్యంగా రక్షణ, ఇంధనం, యుటిలిటీస్ రంగాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు అద్భుతమైన పనితీరు కనబరిచాయి. ఈ కాలంలో బీఎస్ఈ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ అత్యంత వేగంగా, నిలకడగా సంపదను సృష్టించిన సంస్థలుగా నిలిచాయి. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా అవతరించింది. "భారతదేశం అత్యంత శక్తివంతమైన కాంపౌండింగ్ శకంలోకి ప్రవేశిస్తోంది. మన ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల నుంచి 16 ట్రిలియన్ డాలర్ల వైపు పయనిస్తోంది. ఇది ఇన్వెస్టర్లకు కొన్ని ట్రిలియన్ డాలర్ల అవకాశాన్ని సృష్టిస్తుంది. నాణ్యమైన కంపెనీలను ఎంచుకుని దీర్ఘకాలం వేచిచూడటమే సంపద సృష్టికి మార్గం" అని మోతీలాల్ ఓస్వాల్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ తెలిపారు. గత 17 ఏళ్లలో భారత జీడీపీ 1 ట్రిలియన్ డాలర్ల నుంచి 4 ట్రిలియన్ డాలర్లకు పెరిగిందని, రానున్న 17 ఏళ్లలో ఇది మళ్లీ నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. ఈ 'మల్టీ-ట్రిలియన్ డాలర్' శకంలో ఫైనాన్షియల్స్, కన్స్యూమర్ రంగాల్లో భారీ వృద్ధి నమోదవుతుందని పేర్కొంది.

# రష్యాకు ట్రంప్ ఆఫర్లు

**ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకే వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం**

న్యూయార్క్: ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు భారీ ఆఫర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మాస్కోకు అనుకూలంగా ట్రంప్ కొన్ని ప్రతిపాదనలు చేసినట్లు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఒక కథనంలో పేర్కొంది. అమెరికా మీడియా కథనాల ప్రకారం, ఇటీవల యూరోపియన్ దేశాలకు అందజేసిన శాంతి ప్రణాళికకు అనుబంధంగా ట్రంప్ ఈ తాజా ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలలో ఐరోపా దేశాలకు రష్యా నుంచి ఇంధన సరఫరాను పునరుద్ధరించడం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఆ దేశంలోని అరుదైన ఖనిజ రంగాల్లో పెట్టుబడులతో పాటు స్తంభింపజేసిన రష్యా ఆస్తుల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఉన్నాయని సమాచారం. అమెరికా వ్యాపార, ఆర్థిక సంస్థలు స్తంభింపజేసిన 'రష్యా సార్వభౌమ నిధి'ని ఉక్రెయిన్‌లో ప్రాజెక్టులకు వినియోగించే ప్రణాళికలు కలిగి ఉన్నాయి. వీటిలో జపోరిజియా అణు విద్యుత్ కేంద్రం శక్తితో ఒక డేటా సెంటర్ ఏర్పాటు, రష్యాలోని అరుదైన ఖనిజాల వెలికితీత, చమురు తవ్వకం వంటి అంశాలు ఉన్నాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ఇటీవల 28 సూత్రాలతో ఒక శాంతి ప్రణాళికను రూపొందించారు. అయితే, ఇందులో ఎక్కువ అంశాలు రష్యాకు అనుకూలంగా ఉన్నాయని నాటో దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తూ కొన్ని సవరణలు సూచించాయి. ఈ శాంతి ప్రణాళికను ముందుకు తీసుకెళ్లే అంశంపై అమెరికా మధ్యవర్తిత్వంతో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# 5 రాష్ట్రాల్లో 'సర్' గడుపు పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును వారం రోజుల పాటు పొడిగించింది. ఈ పొడిగింపు తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులకు వర్తిస్తుంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో ఎస్ఐఆర్ గడువు డిసెంబర్ 14 (ఆదివారం)తో ముగియాల్సి ఉండగా, దీనిని డిసెంబర్ 19 (శుక్రవారం) వరకు పొడిగించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబర్‌లలో డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 23 వరకు, ఉత్తర ప్రదేశ్‌లో డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 31 వరకు గడువును పొడిగించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యవస్థీకృత పద్ధతిలో పూర్తి చేయడానికి, కచ్చితమైన, నవీకరించబడిన ఓటర్ల జాబితాను నిర్ధారించడానికి మరో రెండు వారాల సమయం ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా వెల్లడించారు. మరణించిన, బదిలీ చేయబడిన, గైర్హాజరైన ఓటర్లకు సంబంధించిన వివరాలను ధృవీకరించడానికి వీలుగా గడువును పొడిగించినట్లు ఆయన తెలిపారు.

ఈవార్తలు
వినోదవాణి CINEMA
శుక్రవారం 12-12-2025 www.evarthalu.com



వయ్యారి చిత్రం







# అఖండ-2 ధరల జీవో రద్దు



అఖండ-2 కు నిర్మాతలకు భారీ షాక్ తగిలింది. ఈ సినిమా ప్రీయయర్ షో టికెట్ ధరల పెంపు జీవోను తెలంగాణ హైకోర్టు సస్పెండ్ చేసింది. అఖండ-2 మూవీ సినిమా టికెట్ల ధర పెంపుపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ప్రీమియర్ షో టికెట్ ధరల పెంపు జీవోను నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నిర్మాణ సంస్థకు నోటీసులిచ్చింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. అంతకుముందు.. తెలంగాణలో టికెట్ల రేట్లను భారీగా పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జీఎస్టీతో కలుపుకొని సింగిల్ స్క్రీన్లకు టికెట్‌పై రూ.50, మల్టీప్లెక్సుల్లో టికె ట్ ధరపై రూ.100 అదనంగా పెంచుకునే అవకాశం కల్పించింది. అలాగే గురువారం రాత్రి 8 గంటలకు ఒక ప్రత్యేక షోకు రూ.600 టికెట్ రేటుకు అనుమతులిస్తూ ప్రభుత్వం జీవోలో పేర్కొంది. తాజాగా హైకోర్ట్ ప్రీమియర్ షో టికెట్ ధరల పెంపును సస్పెండ్ చేసింది.

**శివ శివ సాంగ్ రిలీజ్**

మరికొన్ని గంటల్లో థియేటర్‌లలో సందడి చేసేందుకు 'అఖండ 2' సిద్ధం కాగా, ఇందులోని 'శివ శివ..' అంటూ సాగే ఎమోషనల్ ఆడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి లిరిక్స్ రాయగా.. కనకవ్వ, శ్రుతి రంజనీ ఆలపించారు.



# సోషల్ మీడియాను బ్యాన్ చేయాలి

సోషల్ మీడియాతో పిల్లల్లో ఏకాగ్రత తగ్గిపోతోంది. చదువుపై దృష్టి సరిగా నిలకడగా లేకపోవడానికి కారణమవుతోంది. లైక్స్, షేర్స్, కామెంట్స్ కోసం ఆతృతగా ఎదురుచూస్తూ చిన్న చిన్న వయసులోనే ఆత్మవిశ్వాసం దెబ్బతినే పరిస్థితి వస్తోంది. అదే సమయంలో, డిజిటల్ ప్రపంచంలో ఉన్న ప్రమాదాల గురించి అవగాహన లేకపోవడంతో స్కామ్‌లు, నకిలీ అకౌంట్స్, ఆన్‌లైన్ బుల్లీయింగ్ వంటి సమస్యల్లో చిక్కుకునే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. నిజమైన ఆటలు, బయట తిరుగుడు, స్నేహితులతో గడిపే ఆ అనుభూతులు అన్ని డిజిటల్ స్క్రీన్‌ల మధ్యే కరిగిపోయాయి. ఈ పర్యవసానాలపై సోనూసూద్ స్పందించాడు. మానసిక ఆరోగ్యం, చదువు, సామాజిక వ్యవహారం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో డిజిటల్ మీడియా తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో 16 ఏళ్లలోపు వారికి ఆన్‌లైన్ మీడియాపై నిషేధం విధించాల్సిన అవసరం ఉందని అన్నారు.

# ధురంధర్ బాగుంది.. కానీ!

## హృతిక్ రోషన్ పోస్టు వివాదం

బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ జంటగా నటించిన సినిమా 'ధురంధర్'. ఈ నెల 5న థియేటర్స్‌లోకి వచ్చి ప్రేక్షకుల మనసులు దోచుకుంది. తాజాగా, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా 'ధురంధర్' రివ్యూ ఇచ్చారు. 'నాకు ధురంధర్ సినిమా చాలా నచ్చింది. హృదయానికి హత్తుకునేలి తీర్చిదిద్దిన చిత్ర బృందానికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ కథను ఇంత అద్భుతంగా తెరకెక్కించి ప్రేక్షకులకు అందించారు. అయితే ఇందులో చూపించిన రాజకీయపరమైన అంశాలను మాత్రం నేను అంగీకరించలేకపోతున్నాను. కానీ దర్శకులు కొన్ని విషయాలపై బాధ్యాతయుతంగా వ్యవహరించాలి కాబట్టి అలా రూపొందిచారని నేను అనుకుంటున్నాను. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తిగా నేను ఈ చిత్రాన్ని ఆస్వాదించాను.




# ఉస్తాద్ సందడి వీడియో రిలీజ్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి చిత్ర బృందం ఫ్యాన్స్‌కు క్రేజీ అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పటికే ఫస్ట్ సాంగ్ ప్రోమోను చిత్రబృందం విడుదల చేయగా, సాంగ్ రికార్డింగ్ సమయంలో స్టూడియోలో నెలకొన్న సందడికి సంబంధించిన వీడియోను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ వీడియోలో డైరెక్టర్ హరీశ్ శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్, సింగర్ విశాల్ దద్లాని ఉన్నారు. ఈ వీడియో ప్రేక్షకుల్లో మరింత హైప్‌ను పెంచింది. పూర్తి పాటను డిసెంబర్ 13న వస్తుందని చిత్ర బృందం ప్రకటించింది. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్ - డైరెక్టర్ హరీశ్ శంకర్ - దేవిశ్రీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రమిది.

# నేడు అన్నగారు రావడం లేదు!

అఖండ 2 సినిమా వాయిదా నుంచి సినీ అభిమానులు తేరుకోకముందే మరో చిత్రం వాయిదా పడింది. కోలీవుడ్ నటుడు కార్తీ నటించిన అన్నగారు వస్తారు సినిమా వాయిదా పడినట్లు నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ తెలిపింది. దీంతో తెలుగు, తమిళంలో థియేటర్స్‌లో శుక్రవారం విడుదల కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో ఆగిపోయింది. కొత్త డేట్‌పై క్లారిటీ రావాల్సి ఉంది. కార్తీ, కృతిశెట్టి నటించిన ఈ సినిమాకు నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించారు. రెండేళ్ల క్రితమే షూటింగ్ మొదలైనప్పటికీ అనివార్య కారణాల వల్ల రిలీజ్ ఆలస్యమవుతూ వచ్చింది. తీరా ఇప్పుడు విడుదల చేసేందుకు సిద్ధమైతే పాత అప్పుల కారణంగా కోర్టు.. రిలీజ్‌పై స్టే విధించింది.






# సైకోలతో జాగ్రత్త

సింగర్ చిన్మయి ఫొటోని మార్ఫింగ్ చేసిన కొందరు.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన చిన్మయి.. తన ఇన్ స్టాలో ఓ వీడియో రిలీజ్ చేసింది. ఇలాంటి సైకోలతో మహిళలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. 'ఈరోజు ఒక పేజీ నుండి మార్ఫింగ్ చేసిన నా చిత్రాన్ని తీసుకొని పోలీసులను ట్యాగ్ చేశాను. చట్టపరమైన చర్యలు తీసుకుంటారా లేదా అనేది సమస్య కాదు. మా కుటుంబాన్ని వేధించడానికి గత 8-10 వారాలుగా డబ్బు చెల్లించి ఇలాగే చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు వారి భార్య, చెల్లెళ్లను ఎక్కువగా వేధిస్తారు. ఈ సైకోల పట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలి' అని సూచించింది. పుట్టిన పిల్లలు చచ్చిపోవాలని కోరుకునే ఇలాంటి అబ్బాయిలకు అమ్మాయిలని ఇచ్చి పెళ్లి చేయాలా? అని ప్రశ్నించింది.

# భారత బ్యాటర్ల ఫ్లాప్ షో

## గిల్ పేలవ ప్రదర్శన.. తొలి బంతికే డకౌట్.. డికాక్ మెరుపులు.. 1-1తో టీ20 సిరీస్ సమం



**టీ20 సిరీస్‌ను భారీ విజయంతో ఆరంభించిన భారత జట్టుకు భారీ షాక్ తగిలింది ముల్లన్‌పూర్‌లో క్వింటన్ డికాక్(90) మెరుపులతో భారీ స్కోర్ చేసిన దక్షిణాఫ్రికా బౌలర్ల విజృంభణతో సిరీస్ సమం చేసింది. 214 పరుగుల ఛేదనలో టాపార్డర్ విఫలమవ్వగా తిలక్ వర్మ(62), జితేశ్ శర్మ(27)లు మాత్రమే పోరాడారు.**

లుంగి ఎంగిడి(2-26), బార్ట్‌మన్ (4-24)ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టారు. దాంతో.. 51 పరుగుల తేడాతో ప్రొటీస్ జట్టు సిరీస్ సమం చేసింది. 214 ఛేదనలో ఓపెనర్ శుభ్‌మన్ గిల్(0) మరోసారి విఫలమవ్వగా.. దంచేస్తున్న అభిషేక్ శర్మ(17)ను యాన్సెన్ పెవిలియన్ పంపి బ్రేకిచ్చాడు. సఫారీ బౌలర్లు వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. 67కే నాలుగు వికెట్లు పడిన వేళ తిలక్ వర్మ (62), హార్దిక్ పాండ్యా(20)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, సిపమ్లా ఓవర్లో పాండ్యా ఔట్ కావడంతో మ్యాచ్‌పై ఆశలు సన్నగిల్లాయి. ఆఖర్లో జితేశ్ శర్మ(27) ధనాధన్ ఆడినా.. ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసిన బార్ట్‌మన్ (4-24) సఫారీలకు భారీ విజయాన్ని అందించాడు. అంతకుముందు సఫారీ బ్యాటర్లు దుమ్ముదులిపారు. ఓపెనర్ క్వింటన్ డికాక్(90) విధ్వంసక ఆటతో స్కోరు రెండొందలు కొట్టింది. ముల్లనూర్ స్టేడియంలో భారత బౌలర్లను ఉతికేసిన డికాక్ మెరుపు అర్ధ శతకంతో చెలరేగాడు. సిక్సర్ల మోత మోగించిన అతడిని జితేశ్ శర్మ స్టంపౌట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ, ఆఖర్లో డొనోవాన్ ఫెరీరా(30 నాటౌట్), డేవిడ్ మిల్లర్(20 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. చివరి మూడు ఓవర్లలో ఈ ద్వయం 49 రన్స్ పిండుకోగా నిర్ణీత ఓవర్లలో ప్రొటీస్ టీమ్ 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది.




### నేటి నుంచి అండర్ 19

# ఆసియా కప్

### నేడే భారత్ - యూఏఈ మ్యాచ్

### 14న భారత్-పాక్ మధ్య పోరు




యూఏఈ వేదికగా శుక్రవారం నుంచి అండర్-19 ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈసారి కూడా భారత్, పాకిస్తాన్ మధ్య మరో మహా సమరం జరగనుంది. అండర్-19 ఆసియా కప్ 2025లో భారత్, పాకిస్తాన్ మధ్య హై-వోల్టేజ్ మ్యాచ్ డిసెంబర్ 14న జరగనుంది. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్ ఐసీసీ అకాడమీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. సీనియర్ మెన్స్ ఆసియా కప్‌లో భారత్ పాకిస్తాన్‌ను ఫైనల్‌తో సహా 3 సార్లు ఓడించింది. అయితే రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో మాత్రం పాకిస్తాన్ భారత్‌ను ఓడించింది. ఈ అండర్-19 ఆసియా కప్‌లో ఏ జట్టు పైచేయి సాధిస్తుందో. అండర్-19 ఆసియా కప్‌లో భారత్‌కు ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో విధ్వంసకర బ్యాట్స్‌మెన్ వైభవ్ సూర్యవంశీ కూడా భాగమయ్యాడు.

### టీమ్ ఇండియా పూర్తి షెడ్యూల్ (గ్రూప్ దశ)

**భారత్ వర్సెస్ యూఏఈ -డిసెంబర్ 12(ఐసీసీ అకాడమీ గ్రౌండ్), ఉదయం 10:30 గంటలకు**

**భారత్ వర్సెస్ పాకిస్తాన్ -డిసెంబర్ 14(ఐసీసీ అకాడమీ గ్రౌండ్), ఉదయం 10:30 గంటలకు**

**భారత్ వర్సెస్ మలేషియా- డిసెంబర్ 16(ది సెవెన్స్ స్టేడియం), ఉదయం 10:30 గంటలకు**

## మహిళా క్రికెటర్లకు ఫీజు పెంపు!

### కోహ్లీ, రోహిత్ గ్రేడ్ మార్చే అవకాశం

### 22న సమావేశంలో నిర్ణయాలు

మహిళల క్రికెట్ అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. వన్డే ప్రపంచకప్ చాంపియన్‌గా అవతరించిన టీమిండియా క్రికెటర్లకు ప్రోత్సాహకంగా మ్యాచ్ ఫీజులను పెంచనుంది. డిసెంబర్ 22 న జరుగనున్న సమావేశంలో మ్యాచ్ ఫీజుల సవరణ అంశం ప్రధానంగా చర్చకు రానుంది. ఈమధ్యే స్వదేశంలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు తొలిసారి



విశ్వవిజేతగా నిలిచింది. మహిళా క్రికెట్ చరిత్రలో తొలి ఐసీసీ ట్రోఫీతో దేశం గర్వపడేలా చేసింది హర్మన్‌కౌర్ బృందం. దాంతో.. దేశవాళీలో మహిళా క్రికెటర్లకు వేతనాలు పెంచాలనే నిర్ణయానికొచ్చింది బీసీసీఐ. ప్రస్తుతం డొమెస్టిక్ మ్యాచ్‌లకు చెల్లిస్తున్న మ్యాచ్ ఫీజుల సవరణపై డిసెంబర్ 22 న వర్చువల్‌గా జరిగే సమావేశంలో బీసీసీఐ ప్రతినిధులు చర్చించనున్నారు. ఇదే మీటింగ్‌లో భారత పురుషుల జట్టు ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ అంశం కూడా తెరపైకి రానుంది. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గ్రేడ్ మారే అవకాశముంది. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో ఉన్న వీరిని ఏ గ్రేడ్‌కు మారుస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. అంపైర్లు, మ్యాచ్ రిఫరీల జీతాల పెంపుపై కూడా బీసీసీఐ పెద్దలు నిర్ణయం తీసుకోనున్నారు. అయితే.. పురుషులతో పోల్చితో మహిళా క్రికెటర్లకు దేశవాళీ ఫీజులు తక్కువే ఉండే అవకాశముంది.

### పురుషుల గ్రేడ్స్ ఇలా..

**ఏ ప్లస్ గ్రేడ్: రూ.7 కోట్లు.. ఏ గ్రేడ్: రూ.5 కోట్లు**

**బీ గ్రేడ్: రూ.3 కోట్లు.. సీ గ్రేడ్: రూ.1 కోటి**

# రూ.100కే

### నిన్న సాయంత్రం నుంచే అమ్మకం షురూ

# టీ20 ప్రపంచకప్ టికెట్లు

### భారత్-యూఏఈ మ్యాచ్ టికెట్ విడుదల చేసిన సూర్య, రవిశాస్త్రి

**టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ మండలి.. టికెట్ల అమ్మకాలను సైతం ప్రారంభించింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచకప్ టికెట్లు గురువారం సాయంత్రం 6:45 నుంచి అందుబాటులోకి వచ్చాయి.**




**అభిమానులను భారీగా స్టేడియాలకు రప్పించాలనే ఉద్దేశంతో టికెట్ కనీస ధరను రూ.100గా నిర్ణయించామని ఐసీసీ సీఈఓ సనోజ్ గుప్తా వెల్లడించారు.**

భారత గడ్డపై ఫిబ్రవరి 7న టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. రెండు దేశాల్లోని ఎనిమిది నగరాల్లో ఈ మెగా టోర్నీ జరుగనుంది. ఇప్పటికే పూర్తి స్థాయిలో షెడ్యూల్‌ను ప్రకటించిన ఐసీసీ గురువారం మ్యాచ్ టికెట్ల అమ్మకాలకు తెరతీసింది. టికెట్ల కోసం %https://tickets.cricketworldcup.com% సైట్‌లోకి వెళ్లాలి. ఈ సైట్ అడ్రస్‌పై క్లిక్ చేస్తే నేరుగా 'బుక్‌మైషో' వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. అందులో ఈ బిగ్ ఈవెంట్ టికెట్లను కొనుక్కోవచ్చు. రూ.100 నుంచి మ్యాచ్ టికెట్ ధర షురూ కానున్నందున భారీగా అమ్ముడుపోతాయని ఐసీసీ భావిస్తోంది. 'టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ టికెట్ రూ.100 తో ప్రారంభమవడం టోర్నీపై ఆసక్తిని పెంచేస్తుంది. ఆధునిక వసతులు, స్టేడియంలో సందడితో క్రికెట్‌ను ఎంతో ప్రేమించే భారతీయులకు వరల్డ్ క్లాస్ మ్యాచ్ అనుభూతి కలిగిస్తాం. క్రీడాభిమానులందరూ ఒకచోట కలిసి సెలబ్రేట్ చేసుకునేందుకు ఈ టోర్నీ మహత్తర అవకాశం. ఈ విశ్వ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రాష్ట్రాల బోర్డులు, సంస్థలతో సహకారం తీసుకుంటున్నాం. వరల్డ్ కప్ మ్యాచ్‌లను చూసి జీవితకాల జ్ఞాపకాలను మిగిల్చుకునేందుకు వచ్చే భారత, విదేశీ అభిమానుకులకు స్వాగతం పలుకుతున్నాం' అని సనోజ్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపాడు.




### 20 జట్లు 4 గ్రూప్‌లు

భారత్, శ్రీలంక గడ్డపై వచ్చే ఏడాది జరుగబోయే పురుషుల పొట్టి ప్రపంచకప్ పూర్తి షెడ్యూల్ వచ్చేసింది. ఫిబ్రవరి 7 నుంచి టోర్నీ షురూ కానుండగా.. అదే రోజు రాత్రి 7 గంటలకు ముంబైలో భారత్, అమెరికా తలపడనున్నాయి. అర్హత సాధించిన 20 జట్లను గ్రూప్‌లుగా విభించింది ఐసీసీ. ఒక్కదాంట్లో ఐదు చొప్పున నాలుగు గ్రూప్‌లను చేసింది. ఆతిథ్య దేశమైన టీమిండియా గ్రూప్‌లో పాకిస్థాన్ మాత్రమే పెద్ద జట్టు. కానీ, శ్రీలంక గ్రూప్‌లో ఆస్ట్రేలియా ఉండడంతో ఆ జట్టుకు కఠిన సవాల్ ఎదురవ్వనుంది. ఇక గ్రూప్ 3లో ఇంగ్లండ్, వెస్టిండీస్.. గ్రూప్ 4లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వంటి టెస్టు క్రికెట్ ఆడే జట్లు ఉన్నాయి.

**గ్రూప్ -1 : భారత్, పాకిస్థాన్, నెదర్లాండ్స్, నమీబియా, యూఎస్‌ఏ.**

**గ్రూప్ -2 : శ్రీలంక, ఆస్ట్రేలియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్.**

**గ్రూప్ -3 : ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ.**

**గ్రూప్ -4 : దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్, యూఏఈ, కెనడా.**

### లీగ్ దశ మ్యాచ్ తేదీలు.. వేదిక.. సమయం వివరాలు

ఫిబ్రవరి 7 - పాకిస్థాన్ వర్సెస్ నెదర్లాండ్స్ - కొలంబో, ఉదయం 11:00 గంటలకు.
ఫిబ్రవరి 7 - వెస్టిండీస్ వర్సెస్ బంగ్లాదేశ్ - కోల్‌కతా, మధ్యాహ్నం 3:00 గంటలకు.
ఫిబ్రవరి 7 - భారత్ వర్సెస్ యూఎస్ఏ - ముంబై , రాత్రి 7:00 గంటలకు.
ఫిబ్రవరి 8 - ఇంగ్లండ్ వర్సెస్ నేపాల్ - ముంబై, రాత్రి 7:00 గంటలకు.
ఫిబ్రవరి 8 - శ్రీలంక వర్సెస్ ఐర్లాండ్ - కొలంబో, రాత్రి 7:00 గంటలకు.
ఫిబ్రవరి 9 - బంగ్లాదేశ్ వర్సెస్ ఇటలీ - కోల్‌కతా, ఉదయం 11:00 గంటలకు.
ఫిబ్రవరి 9 - జింబాబ్వే వర్సెస్ ఒమన్ - కొలంబో, మధ్యాహ్నం 3:00 గంటలకు.
ఫిబ్రవరి 10 - పాకిస్థాన్ వర్సెస్ యూఎస్ఏ - కొలంబో, రాత్రి 7:00 గంటలకు.
ఫిబ్రవరి 11 - ఆస్ట్రేలియా వర్సెస్ ఐర్లాండ్ - కొలంబో, మధ్యాహ్నం 3:00 గంటలకు.
ఫిబ్రవరి 11 - ఇంగ్లండ్ వర్సెస్ వెస్టిండీస్ - ముంబై, రాత్రి 7:00 గంటలకు.
ఫిబ్రవరి 12 - శ్రీలంక వర్సెస్ ఒమన్ - క్యాండీ, ఉదయం 11:00 గంటలకు.
ఫిబ్రవరి 12 - భారత్ వర్సెస్ నమీబియా - ఢిల్లీ, రాత్రి 7:00 గంటలకు.
ఫిబ్రవరి 13 - ఆస్ట్రేలియా వర్సెస్ జింబాబ్వే - కొలంబో, ఉదయం 11:00 గంటలకు.




## రో-కోకు గంభీర్ క్రెడిట్ ఇవ్వలేదు

### టీమిండియా కోచ్‌పై ఊతప్ప విమర్శలు

దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ విజయం సాధించిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో గౌతమ్ గంభీర్ స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల పేర్లను ప్రస్తావించకపోవడాన్ని టీమిండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప విమర్శించాడు. వారికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో గెలుచుకుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ శతకాలు, అర్ధ సెంచరీలతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. టీమిండియా వన్డే సిరీస్‌ను గెలవడంలో వీరు కీలక పాత్ర పోషించారు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ మొదటి స్థానంలో కొనసాగుతుండగా, విరాట్ కోహ్లీ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో రాబిన్ ఊతప్ప మాట్లాడుతూ, టీమిండియా వన్డే సిరీస్ విజయం తర్వాత జరిగిన మీడియా సమావేశంలో గౌతమ్ గంభీర్ వారిద్దరికీ తగినంత గుర్తింపు ఇవ్వకపోవడం తాను గమనించానని అన్నాడు. రోహిత్, కోహ్లీ ద్వయం తమ ఫామ్‌పై వస్తున్న సందేహాలకు తమ ప్రదర్శనతో సమాధానం చెప్పారని పేర్కొన్నాడు. వారిద్దరూ తమ అద్భుతమైన బ్యాటింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించారని, తాము ఫామ్‌లో ఉంటే జట్టు కోసం ఏం చేయగలమో చేసి చూపించారని రాబిన్ ఊతప్ప అన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

## మనోళ్లు 'ఆట'గాళ్లే!

### విదేశాలకు వెళ్తే తప్పుడు పనులు

### జడేజా భార్య రివాబా సంచలన వ్యాఖ్యలు

### తన భర్త ఆణిముత్యం అని కితాబు

గుజరాత్ విద్యా శాఖ మంత్రి, రవీంద్ర జడేజా సతీమణి రివాబా భారత జట్టు ఆటగాళ్లపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. తన భర్తను పొగుడుతూనే ఇతర భారత ఆటగాళ్లు తప్పుడు పనులు చేస్తారని ఆరోపించారు. ఓ కార్యక్రమంలో వేదికపై మాట్లాడుతూ.. 'నా భర్త లండన్, దుబాయ్, ఆస్ట్రేలియా వంటి అనేక దేశాలకు ఆడటానికి వెళ్లవలసి వస్తుంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఆయన ఎప్పుడూ వ్యసనానికి లోను కాలేదు. ఎందుకంటే ఆయన తన బాధ్యతను అర్థం చేసుకుంటారు' అని అన్నారు. రివాబా జడేజా తన మాటలను కొనసాగిస్తూ, తన భర్తకు అలాంటి తప్పుడు పనులు చేయడానికి ఎటువంటి ఆటంకాలు లేవని కూడా పేర్కొన్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 12-12-2025 | www.evarthalu.com




# దక్షిణాదిపై బీసీసీఐ వివక్ష

భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) గ్రౌండ్ కేటాయింపు విధానాలు ఎప్పుడూ వివాదాస్పదమే. ఇటీవలి కాలంలో, ముఖ్యంగా 2025-26 సీజన్‌లో, ఈ వివక్ష మరింత స్పష్టంగా కనిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలు - తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ తదితర రాష్ట్రాలు క్రికెట్ చరిత్రలో ముఖ్యమైన స్థానం కలిగి ఉన్నప్పటికీ, బీసీసీఐ వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వైపు మొగ్గు చూపుతోంది. ఇది కేవలం యాదృచ్ఛికమా? లేదా రాజకీయ ప్రభావాలు, వ్యక్తిగత లాభాలు కలిసిన ఒక ఆటా? 1928లో ప్రారంభమైన బీసీసీఐ.. భారత క్రికెట్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లింది. కానీ ఇటీవలి దశాబ్దాల్లో, ముఖ్యంగా జయ్ షా బీసీసీఐ సెక్రటరీగా, తర్వాత ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత, గుజరాత్ రాష్ట్రానికి, ముఖ్యంగా అహ్మదాబాద్ కోసమే క్రికెట్ అన్నట్లు కనిపిస్తోంది.

జయ్ షా, కేంద్ర హోమ్ మినిస్టర్ అమిత్ షా కుమారుడు కావడం వల్ల, రాజకీయ ప్రభావాలు ఇక్కడ పాత్ర పోషిస్తున్నాయన్నది కాదనలేని వాస్తవం. 2023లో వరల్డ్ కప్ ఫైనల్ అహ్మదాబాద్‌లో జరగడం, 2026 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ కూడా అక్కడే నిర్వహించాలని ఐసీసీ నిర్ణయించడం - ఇవన్నీ ఈ వివక్షకు ఉదాహరణలు. దక్షిణాది రాష్ట్రాలు క్రికెట్‌కు ఎంతో సేవ చేశాయి. చెన్నైలోని చెపాక్ స్టేడియం, బెంగళూరు చిన్నస్వామి స్టేడియం, హైదరాబాద్ రాజీవ్ గాంధీ స్టేడియం - ఇవి భారత క్రికెట్ చరిత్రలో ఐకానిక్ వేదికలు. రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, అశ్విన్, అజారుద్దీన్, కృష్ణమాచారి శ్రీకాంత్ వంటి లెజెండ్స్ ఇక్కడి నుంచే వచ్చారు. కానీ 2025-26 సీజన్ షెడ్యూల్ చూస్తే, దక్షిణాది రాష్ట్రాలకు బీసీసీఐ మొండి చెయ్యి చూపుతోందని అర్థం అవుతోంది. ఉదాహరణకు, వెస్టిండీస్ టూర్ ఆఫ్ ఇండియాలో మొదటి టెస్ట్ అహ్మదాబాద్‌లోనే, సౌతాఫ్రికా టూర్‌లో 5వ టీ20 అహ్మదాబాద్‌లోనే, ఇక సౌతాఫ్రికా ఏ టీమ్ టూర్‌లో మూడు వన్డేలు రాజ్‌కోట్‌లో (గుజరాత్). మొత్తం గుజరాత్‌కు 5 మ్యాచ్‌లు కేటాయించగా, దక్షిణాదికి 3 మాత్రమే కేటాయించారు.

అహ్మదాబాద్‌కే మ్యాచ్‌ల కేటాయింపు ఎందుకు? అంటే.. నరేంద్ర మోదీ స్టేడియం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం (1.32 లక్షల సీటింగ్ కెపాసిటీ) కావడం ఒక కారణం. కానీ ఇది కేవలం సాంకేతిక కారణమా? లేదు. రాజకీయ ఫేవరిటిజం ఇక్కడ కీలకం. జయ్ షా గుజరాత్ నుంచి వచ్చినవాడు కావడం, బీజేపీతో అతని సంబంధాలు - ఇవి అహ్మదాబాద్‌ను 'క్రికెట్ క్యాపిటల్'గా మార్చుతున్నాయి. 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్, ఫైనల్ అహ్మదాబాద్‌లో జరగడం విమర్శలకు దారితీసింది. ఇప్పుడు 2026 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ కూడా అక్కడే - ఇది 'పాలిటిక్స్ అండ్ ఫేవరిటిజం' అని శివసేన నాయకుడు ఆదిత్య థాకరే బాహాటంగానే విమర్శించారు.

## దక్షిణాదికి ఆర్థిక నష్టాలు


దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష కారణంగా క్రికెట్ మ్యాచ్‌లు కేటాయింపు జరగడం లేదు. దాంతో.. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లు స్థానిక ఆర్థిక వ్యవస్థను బూస్ట్ చేస్తాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, ట్రాన్స్‌పోర్ట్, టూరిజం.. ఇలా అన్నీ ప్రభావితం అవుతాయి. అహ్మదాబాద్‌కు అన్ని బిగ్ మ్యాచ్‌లు వెళ్తుంటే, చెన్నై, బెంగళూరు లాంటి నగరాలు ఈ లాభాలను కోల్పోతున్నాయి. బీసీసీఐ ఈ వేదికలను నిర్లక్ష్యం చేయడం వల్ల, దక్షిణాది అభిమానులూ అలసిపోతున్నారు. ఇది క్రికెట్‌ను 'నార్త్ వర్సెస్ సౌత్' డివైడ్‌గా మారుస్తోంది. దేశీయ ఐక్యతకు హాని కలిగిస్తుంది. అటు.. ముంబై, కోల్‌కతా లాంటి సంప్రదాయ వేదికలు కూడా నిర్లక్ష్యమవుతున్నాయి. వాటితో పోల్చితే దక్షిణాది పరిస్థితి మరీ దారుణం. బీసీసీఐ రొటేషన్ పాలసీని అమలు చేయాలి. అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు ఇవ్వాలి. దీనికోసం దక్షిణాది అసోసియేషన్లు ఐక్యమై గళం విప్పాలి. రాజకీయ ప్రభావాలను తొలగించి, క్రికెట్‌ను ప్యూర్ స్పోర్ట్‌గా ఉంచాలి. లేకపోతే, భారత క్రికెట్ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఇది కేవలం వివక్ష కాదు, దేశీయ అసమానతలను పెంచే చర్య. బీసీసీఐ ఈ మార్గాన్ని మార్చకపోతే, దక్షిణాది అభిమానులు బాయ్‌కాట్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది.

**- హనుమంతు వీరదేవర**
**క్రికెట్ విశ్లేషకుడు**



# సార్ కొట్టిండు.. అంతు చూస్తం!

సమాజంలో మార్పులు అనివార్యం. కానీ, కొన్ని మార్పులు సమాజానికి హానికరంగా మారుతున్నాయి. అందులో ముఖ్యమైనది పిల్లల్లో పెద్దల పట్ల, ముఖ్యంగా గురువుల పట్ల తగ్గుతున్న గౌరవం. భారతీయ సంస్కృతిలో గురువును దైవత్వంగా కొలిచే సంప్రదాయం ఉంది. గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః అని మన శాస్త్రాలు చెబుతాయి. కానీ, నేడు ఈ గౌరవం క్రమంగా క్షీణిస్తోంది. విద్యార్థులు గురువులను అవమానించడం, ఆదేశాలను పాటించకపోవడం, కొన్ని సందర్భాల్లో హింసకు దిగడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఇది విద్యావ్యవస్థకు మాత్రమే కాకుండా, మొత్తం సమాజానికి సవాలుగా మారింది.



పెద్దలను గౌరవించకపోవడం అనేది పాఠశాలల్లోనే కాకుండా, ఇంట్లో కూడా కనిపిస్తోంది. పిల్లలు తల్లిదండ్రులు, నానమ్మ-తాత, అమ్మమ్మ-తాత పట్ల అసహనం చూపడం, వారిని అవమానించడం వంటివి సాధారణమవుతున్నాయి. గురువుల పట్ల గౌరవం తగ్గడానికి విద్యా వ్యవస్థ వాణిజ్యీకరణ, సమాజంలో నైతికతల లోపం వంటి కారణాలు ఉన్నాయి. ఆధునిక కుటుంబాల్లో తల్లిదండ్రులు పిల్లలను అతిగా పాంపరింగ్ చేస్తున్నారు. పిల్లలు ఏమీ చేయకుండా ఉండటం, వారి తప్పులను కప్పిపుచ్చడం వంటివి సాధారణమవుతున్నాయి. ఇళ్లలో పనిమనుషుల సంస్కృతి పెరగడం వల్ల పిల్లలు మర్యాదలు, శ్రమను నేర్చుకోవడం లేదన్నది నిజం. తల్లిదండ్రులు పని ఒత్తిడి వల్ల పిల్లలతో సమయం గడపకపోవడం, వారిని గాడ్జెట్‌లకు అలవాటు చేయడం వల్ల పిల్లలు సామాజిక నైపుణ్యాలు కోల్పోతున్నారు. ఇది వారిని అసహనవంతులు, అహంకారవంతులుగా మారుస్తోంది. అటు.. విద్యా వ్యవస్థ కోణం నుంచి చూసినా, విద్యా వ్యవస్థలో కూడా లోపాలు ఉన్నాయి. గురువులు సరైన శిక్షణ లేకుండా ఉండటం, వారు విద్యార్థులతో సరైన సంబంధం పెంచుకోకపోవడం వంటివి ముఖ్య కారణాలు. పాఠశాలలు వాణిజ్యీకరణ వల్ల గురువులు విద్యార్థులను కస్టమర్లుగా చూడటం ప్రారంభమైంది, ఇది గురు-శిష్య సంబంధాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. గురువులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏంటంటే.. గౌరవ లోపం, ఒత్తిడి. ఇవి విద్యార్థుల ప్రవర్తనను ప్రభావితం చేస్తున్నాయి. సమాజ, మీడియా కోణం నుంచి చూసినా.. పాశ్చాత్యీకరణ, సామాజిక మాధ్యమాలు పిల్లలపై ఎఫెక్ట్ చూపుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో అసభ్య ప్రవర్తనను చూసి పిల్లలు అనుసరిస్తున్నారు. సినిమాల్లో విలన్లను హీరోలుగా చూపించి సినిమాలు తీయడం వల్ల పిల్లలు అదే అనుకరిస్తున్నారు. ఇంట్లో పెద్దలను గౌరవించకపోవడం వల్ల కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయి. దీర్ఘకాలంలో, ఇది సమాజంలో అరాచకానికి దారితీస్తుంది. పలు సందర్భాల్లో పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇది ఆత్మహత్యల వంటి ఘటనలకు దారితీస్తుంది. ఇప్పటి నుంచైనా తల్లిదండ్రులు పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి. హిందూ శాస్త్రాలు, మర్యాదలు బోధించాలి. పిల్లల తప్పులను కప్పిపుచ్చకుండా సరిచేయాలి. సిలబస్‌లో నైతిక విద్య చేర్చాలి. పాఠశాలలు డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు పెంచాలి. గురువులను అవమానించిన విద్యార్థులకు శిక్షలు విధించాలి. మీడియా, సామాజిక మాధ్యమాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. పిల్లలు పెద్దలను, గురువులను గౌరవించే సమాజ నిర్మాణం మన బాధ్యత. ఇది మన భవిష్యత్తును రక్షిస్తుంది.

**- డాక్టర్ విశ్వజిత్, మానసిక వైద్య నిపుణుడు**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.